ప్రజాపక్ష

సమీక్ష

జూలై 1-15, 2003 సమతా పబ్లికేషన్స్ ప్రచురణ వెల : రూ. 5-00

గౌరవ సంపాదకులు :
ఎబికె ప్రసాద్

సంపాదకులు :
వి. హనుమంతరావు

సహాయ సంపాదకులు :
ఇప్ప వీరారెడ్డి

సలహా మండలి :
ప్రొ॥ ఆర్.వి.ఆర్.చంద్రశేఖరరావు
ప్రొ॥ వకుళాభరణం రామకృష్ణ
డి. పాపారావు
బి. సాంబశివరాజు
ఎన్. వేణుగోపాల్

లోపలి పేజీల్లో...

వార్షిక చందా రూ॥ 120/-లు

Edited, Printed and Published by
V. Hanumantha Rao
for Samata Publications
D.No. 8-3-898/22, Road No. 3,
Nagarjuna Nagar,
Hyderabad - 500 073.
Phone : 23748672

Designed & Printed at :
Nutan Art Printers
Lakdi-ka-pool, Hyderabad.

సంపాదకీయం:

రాజశేఖరుని ప్రజాప్రస్థానం

గ్రామీణ ప్రజలపై పంజావిసిరిన కరువు పరిస్థితులను స్వయంగా తెలుసుకోవడానికి కాంగ్రెస్ నాయకుడు రాజశేఖరరెడ్డి ప్రారంభించిన ప్రజాప్రస్థానం ముగిసింది. ఆయన జీవితంలో, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఇదొక మరవరాని సంఘటన. ఇంత పెద్ద నాయకుడు ఇన్నిరోజులు, ఇన్నివందల కిలోమీటర్లు పాదయాత్రచేస్తున్నాడు అని ఆ వింతను చూడడానికి ప్రజలు వచ్చారని కొట్టిపారవేయడం రాజకీయ పరిణతి లేనివారు చేసే విమర్శ. ప్రజల మనసుల్లో గూడుకట్టుకున్న అసంతృప్తికి రాజశేఖరుని పాదయాత్ర కిటికీ తెరిచింది. ఆ అసంతృప్తి గాలులకు తెలుగుదేశం పీఠాలు కదిలిపోయాయనడానికి, కోటివరాల ప్రకటనే తిరుగులేని నిదర్శనం. ఆయన మహాప్రస్థానంలో ప్రజల నుంచి అందుకున్న మహజర్లు, వారు చేసుకున్న విన్నపాలు వింటూంటే 18 జన్మభూముల తర్వాత, పదుల సంఖ్యలో ప్రవేశపెట్టిన ప్రచార ప్రధాన పథకాల తర్వాతకూడా గ్రామీణ జీవితంలో ఏ మార్పూ తీసుకునిరాలేదనడాన్ని రుజువు చేస్తున్నాయి. ప్రజలు ఆయన ముందుంచిన సమస్యలను పరిష్కరించడానికి ఆయన అధికారంలో లేరు. కాని ఆయన పార్టీ అధికారంలోవున్న మూడు దశాబ్దాల కాలంలో ప్రాజెక్టుల రూపేణా, పరిశ్రమల రూపేణా రాష్ట్రం అభివృద్ధి చెందిందికాని, రాష్ట్ర ప్రజలు మాత్రం కాదు అనడానికి 1983లో తెలుగుదేశం అధికారంలోకి రావటమే తిరుగులేని సాక్ష్యం. ఆ తర్వాత కేరళలోలాగ ఓసారి మళ్ళీ కాంగ్రెస్‌ను, తిరిగి తెలుగుదేశాన్ని అధికారంలోకి పంపారు.

ఇపుడు మళ్ళీ కాంగ్రెస్ వస్తుందా అని ప్రశ్నించుకునేదానికన్నా, ఏ విధానాలైతే ప్రజలను నేటి దుస్థితిలోకి నెట్టాయో, ఆ విధానాలను వెనక్కి తిప్పికొట్టడం నేటి ప్రధాన కర్తవ్యం. ఆ విధానాలకు ప్రపంచ బ్యాంకుకు పీటముడి పడింది కాబట్టి, ఆ బ్యాంకు ఆదేశించిన విధానాలే ప్రజలను, ముఖ్యంగా రైతాంగాన్ని, గ్రామీణులను నేటి దుస్థితికి నెట్టాయి. కాబట్టి, ఆ బ్యాంకుతో తెగతెంపులు చేసుకోవటం అత్యంత అవసరం. వామపక్ష పార్టీలతో, ఇతర ప్రజాస్వామ్య శక్తులతో దోస్తీకి సిద్ధమంటున్న కాంగ్రెస్ నేతలు వారవలంబించబోయే విధానాలను విస్పష్టంగా ప్రకటించాలి. రాష్ట్రంలో వ్యవసాయాన్ని పునరుద్ధరించాలి. పారిశ్రామికంగా పూర్వపు వైభవాన్ని తీసుకురావాలి. నిర్మాణంలో వున్న భారీ నీటిపారుదల ప్రాజెక్టులను నిర్ణీతకాల వ్యవధిలో పూర్తిచేయడానికి పెద్దపీట వేయాలి. గ్రామీణ ప్రజల కొనుగోలుశక్తి పెరగాలి. ఎన్నికల ప్రణాళిక రచనకుముందే ఈ విషయాలపై కాంగ్రెస్ విధాన నిర్ణయాలు చేయాల్సివుంది.

రైతులపై కాల్పులు యాదృచ్ఛికం కాదు

త్రాగునీటి కొరత. వరుసగా మూడు సంవత్సరాలు కరువు పరిస్థితులు. ప్రకృతి వికటించింది. మేమేం చేస్తాం అంటూంది ప్రభుత్వం. విత్తనాల కొరత విషయంలో ఏం చేయలేనని చేతులెత్తేసి ప్రైవేటు వ్యాపారస్తుల దోపిడీకి లాకులెత్తేసింది. *9 గంటలు* విద్యుత్ సరఫరాలో వైఫల్యం అందరికీ తెలిసిన విషయమే. నకిలీ విత్తనాలు, నకిలీ పురుగుమందులను అరికట్టలేకపోయింది. కారణంగా వందలమంది ఆత్మహత్యలు. ఏమడిగినా ఏమీ చేయలేనపుడు ఆ *ప్రభుత్వమెందుకు? ఈ అశక్తత రైతాంగం విషయంలోనే, వ్యవసాయం విషయంలోనే ఎందుకు వస్తుంది? విత్తనాలడిగిన రైతులపై కాల్పులా?*

తిరుపతి తిరునాళ్ళలో హఠాత్తుగా రైతాంగంపై ప్రేమ ఎగదోసుకువచ్చి వరాలు ప్రకటించారు. అంటే ఆనాటివరకు వ్యవసాయం గురించి పట్టించుకోలేదనేగా? వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గుతున్నాయని, ప్రాజెక్టుల నిర్మాణాన్ని పూర్తిచేయ కుండా ఇంకుడుగుంతలు, నీరూ-మీరూ లాంటి టుమ్రీ పథకాలతో కాలం గడపటం సరికాదని అనుభవజ్ఞులు హెచ్చరిస్తూ వచ్చినా పెడచెవిన పెడుతూ వచ్చిందెందుకు? ఇది యాదృచ్ఛికం కాదు ఒక పథకం ప్రకారం సాంప్రదాయ వ్యవసాయంలో ఆధునీకరణ పేరుతో, యాజమాన్య పద్ధతులను ప్రవేశపెట్టాలనే మాటచాటున వ్యవసాయాన్ని కార్పొరేటీకరణ చేయాలనే ప్రపంచ బ్యాంకు ఆదేశాల మేరకే బహుళజాతి సంస్థలకు ధారాదత్తం చేయటం జరుగుతోంది. కుక్కను చంపాలంటే దానికి పిచ్చిపట్టిందని ముద్రవేసినట్లు, కార్పొరేటీకరణ చేయాలంటే ముందు వ్యవసాయాన్ని నష్టజాతకాల జాబితాలో చేర్చాలి. చంద్రబాబు చేస్తున్న పని అదే.

పొమ్మనలేక పొగబెట్టినట్లు వ్యవసాయాన్ని వదలిపెట్టండని రైతులకు చెప్పలేక, పరోక్షంగా ఇప్పటి వ్యవసాయాన్ని ఎండగట్టి, రైతులను కాంట్రాక్టు పద్ధతికి తర్వాత కార్పొరేటీకరణకు మెడలు వంచి ఒప్పించే ప్రయత్నంలో భాగమే విత్తనాల సమస్య కూడా. పంజాబులో కాంట్రాక్టు పద్ధతిని అంగీకరించిన రైతులు చేతులు కాల్చుకున్నామని నాలిక్కరుచు కున్నారు. కాల్పుల వార్త విని చంద్రబాబు తమ దారిలోకి వస్తున్నాడని ప్రపంచబ్యాంకు సంతోషిస్తూండి వుండాలి. ఆ దారినుంచి మళ్ళించి తమ దారికి మళ్ళించుకోవాల్సిన బాధ్యత రైతులదే. బాధ్యతకాదు, వారి మనుగడకే ఇది అవసరం. ○

రాష్ట్ర ప్రభుత్వాల మార్కెట్ రుణాలు

(రూ. కోట్లలో)

సంవత్సరం	స్థూల రుణాలు	నికర రుణాలు	తిరిగి చెల్లింపు
1	2 3	4	
1990-91	2,569	2,569	—
1991-92	3,364	3,364	—
1992-93	3,805	3,471	334
1993-94	4,145	3,638	507
1994-95	5,123	5,123	—
1995-96	6,274	5,931	343
1996-97	6,536	6,536	—
1997-98	7,749	7,192	557
1998-99	12,114	10,700	1,414
1999-2000	13,706	12,405	1,301
2000-2001 అంచనా	11,250	10,830	420

రిజర్వ్ బ్యాంకు

భారతదేశం : అభివృద్ధి, అభివృద్ధేతర ఖర్చు

(రూ. కోట్లలో)

సంవత్సరం	అభివృద్ధి	అభివృద్ధేతర	ఇతరములు	మొత్తం
1	2	3	4	5
1985-90 (Avg.)	70.1	22.8	7.1	100.0
1990-91	63,370 (69.5)	22,600 (24.8)	5,272 (5.8)	91-242 (100.0)
1991-92	74,588 (68.7)	27,143 (25.0)	6,915 (6.4)	108,646 (100.0)
1992-93	80,567 (67.5)	32,104 (26.9)	6,664 (5.6)	119,335 (100.0)
1993-94	89,388 (66.4)	38,020 (28.2)	7,241 (5.4)	134,649 (100.0)
1994-95	104,348 (64.6)	49,556 (30.7)	7,650 (4.7)	161,554 (100.0)
1995-96	114,819 (64.7)	55,380 (31.2)	7,385 (4.2)	177,584 (100.0)
1996-97	132.008 (65.1)	62,095 (30.6)	8,666 (4.3)	202,769 (100.0)
1997-98	145,268 (63.7)	71,767 (31.5)	11,100 (4.9)	228,135 (100.0)
1998-99	164,504 (61.8)	86,474 (32.5)	15,383 (5.8)	266,361 (100.0)
1999-2000 (RE)	198,322 (60.9)	110,137 (33.8)	17,175 (5.3)	325,634 (100.0)
2001-2001 (RE)	208,333 (59.4)	125,484 (35.8)	16,950 (4.8)	350,767 (100.0)

రిజర్వ్ బ్యాంకు

ఆంధ్రప్రదేశ్‌లో ప్రపంచబ్యాంకు పెత్తనం

- డా॥ పి.వి.ఆర్. భాస్కరరావు

(గత సంచిక తరువాయి)

ఇక్కడ గమనించవలసిన విషయం ఏమిటంటే 16 జనవరి, 1997 నాడు వెలువడ్డ ఆంధ్రప్రదేశ్ ఎజెండా ఫర్ ఎకనామిక్ రిఫార్మ్స్ (రిపోర్టు నం. 1590) పేజీలో కోర్ రిఫార్మ్ ప్రోగ్రామ్ పేరిట పట్టిక రూపంలో పొందుపరచిన పరిపాలన మార్పులనే 28 మే, 1998 నాడు ప్రకటించిన డాక్యుమెంటు రిపోర్ట్ నం.17710 ఆం.ప్ర. ఎకనామిక్ రిస్ట్రక్చరింగ్ ప్రాజెక్టులో విశదీకరించబడ్డాయి. అంటే ఆర్థిక సంస్కరణలు, పరిపాలనా విధానాల మార్పుల పేరిట ప్రపంచ బ్యాంకు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల మధ్య జరిగిన అంగీకారం 1997 సంవత్సరానికే రూపొందించబడినదన్నమాట. నిజానికి ఈ అంగీకారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి 1996 అక్టోబరులో ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడితో జరిపిన రహస్య మంతనాలలోనే తప్పక కుదరివుంటుంది. కేంద్ర ప్రభుత్వం ప్రమేయం కాని, రాష్ట్ర ప్రజా ప్రతినిధుల ప్రమేయం కాని ఏమాత్రం లేని ఈ మంతనాలలో మరెన్ని నిగూఢ రహస్యాలు దాగివున్నాయో పెరుమాళ్ళకెరుక.

28 మే, 1998 నాడు ప్రపంచ బ్యాంకు ప్రకటించిన డాక్యుమెంటులో ఫేజ్-I యాక్షన్ ప్లాన్ పేరిట వున్న పట్టికలో 1998 నుంచి 2001 డిసెంబరులోగా ఏయే తేదీలలో 12 ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేయాలి లేక ప్రైవేటీకరణ చేయవలసిందీ ప్రపంచ బ్యాంకు ఆదేశించింది. తరువాత వీటిలో ఇంకొక 7 ప్రభుత్వ రంగ సంస్థలు కూడా - నిజాం చక్కెర ఫ్యాక్టరీతో సహా చేర్చబడ్డాయి. ప్రపంచ బ్యాంకు ఆదేశాలను శిరసావహిస్తూ 29-9-2001న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన ఫేజ్-II పత్రంలో వివిధ క్యాటగిరీల క్రింద 88 ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరణ చేయడానికిగాను, లేక మూసివేయడానికి గాను నిర్ణయం తీసుకొనడమైనది. వీటిలో ఆర్.టి.సి., సింగరేణి కూడా వుండడం గమనార్హం. ఇవీకాక వి.ఎస్.టి., సిర్‌పూర్ పేపర్ మిల్ లాంటి సంస్థలలో ప్రభుత్వానికున్న షేర్లను అమ్మివేయడానికి కుడా నిర్ణయించబడినది. పైకి ఎంత బుకాయిస్తున్నా, ప్రపంచబ్యాంకు గుప్పెట్లో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రోడ్డు రవాణా సంస్థను, సింగరేణి కాలరీస్ సంస్థను రేపో మారో ప్రైవేటీకరణ చేయడానికే నిశ్చయించుకుంది.

ప్రభుత్వ సంస్థలంటే ప్రజల ఆస్థులని, ఈ ప్రజల ఆస్థులకు ప్రభుత్వం ఒక ట్రస్టీదారే కాని, యజమాని కాదని, వీటిని కాపాడడమే ప్రభుత్వ బాధ్యతని, ప్రజలచే ఎన్నుకోబడిన ఓ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌నే అమ్మివేసే దిశలో ప్రపంచ బ్యాంకుకు అడుగులకు మడుగులొత్తుతూ, ప్రజల్ని కాని రాష్ట్ర ప్రజా ప్రతినిధులను కాని, రాజ్యాంగాన్ని కాని లెఖ్ఖచేయకుండా పరిపాలన సాగిస్తూ వుంటే ప్రజలు తీవ్రంగా స్పందించవలసిన అవసరం ఎంతయినా వుంది.

గత అయిదారు సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన అప్పులు 58,000 కోట్ల రూపాయలను దాటి వుంటుందని, ప్రతీ సంవత్సరానికి తీర్చవలసిన వడ్డీ 6000 కోట్ల రూపాయలను మించి వుంటుందని అంచనా. ప్రజల పేరుమీద తీసుకున్న ఈ అప్పును ప్రజలకు తెలియకుండా, ప్రజల సమ్మతి లేకుండా తీసుకునే హక్కు ప్రజాస్వామిక ప్రభుత్వానికెక్కడిది? వడ్డీలో కాస్తయినా తీర్చాలన్న మిషతో ప్రజా ప్రభుత్వం అందించే ప్రజా సేవలన్నిటికీ రుసుము వసూలు చేస్తూ ప్రజల నడ్డి విరగ్గొట్టే హక్కు ప్రభుత్వానికెక్కడిది? ఉన్న అప్పును తీర్చకుండా తిరిగి అప్పు చేయడానికి రాజ్యాంగబద్ధంగా ప్రభుత్వానికి హక్కెక్కడిది? ప్రతీ పౌరుడిమీద దాదాపు రూ.6000/- ఋణభారం విధించే హక్కు ప్రజాప్రభుత్వాని కెక్కడిది? విద్యుత్ చార్జీలు పెరిగాయి, నీటి చార్జీలు పెరిగాయి, ఆస్పత్రులలో రుసుములు విధిస్తున్నారు. పై చదువుల ఫీజులు పెరిగాయి. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయి. ఈ పెరుగు దలలు భరించలేని బీదప్రజానీకానికి, ఈ ప్రజాస్వామిక రాష్ట్రంలో జీవించే హక్కు కూడా లేదా? ఈ ప్రశ్నలన్నీ ప్రజలే ప్రభుత్వాన్ని నిలదీసి అడగవలసిన అవసరం ఎంతయినా వుంది.

ఎన్నికయిన ప్రజా ప్రతినిధులు మంత్రులు, ముఖ్యమంత్రి భారత రాజ్యాంగానికి కట్టుబడి వుంటామని ప్రమాణం చేశారు. భారత రాజ్యాంగ ప్రకారం విదేశాలతో లావాదేవీలు, ఎగ్రిమెంటు పత్రాల మీద సంతకాలు చేయగలిగిన హక్కు కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులకే వుంటుంది. అటువంటిది కేంద్రంతో ఏమాత్రం ప్రమేయం లేకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతినిధులు దుబాయ్ ప్రభుత్వంతోను, అలాగే మలేషియా ప్రభుత్వంతోను అగ్రిమెంటుల మీద సంతకాలు చేయడం కేంద్ర ప్రభుత్వ అధికారాన్ని ధిక్కరించడమే కాకుండా, భారత రాజ్యాంగాన్ని కాలరాయడమే. ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం ఇలా రాజ్యాంగాన్ని కూడా లెక్క చేయకపోవడం - ప్రపంచ బ్యాంకు, ఆ బ్యాంకును ఏలుతున్న మూలవిరాట్టుల వత్తాసు మూలంగానే. దీని మూలంగా భారత దేశ సార్వభౌమత్వాన్ని, ఐక్యతను భగ్నం చేయడానికి కొన్ని విదేశీశక్తులు ప్రయత్నిస్తున్నా యంటే అతిశయోక్తి కానేరదు.

గుడ్ గవర్నెన్స్ (సత్పరిపాలన) కొరకు ఓ కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పరిచింది. ఇది కూడ ప్రపంచ బ్యాంకు మరియు బ్రిటిషు ప్రభుత్వం యొక్క ఆదేశాల మేరకే ఏర్పడింది. దీనిలో కొందరు ఇంగ్లాండుకు చెందిన సలహాదారులు కూడా వుంటారు. ఈ కేంద్రం రాష్ట్ర పరిపాలనను గురించి ఆర్థిక విషయాలను గురించి, రాష్ట్ర బడ్జెట్‌ను గురించి ముఖ్యమైన సలహాలు (ఆదేశాలు) ఇస్తారు. ఈ కేంద్రం వ్యవహారాల్లో ప్రపంచ బ్యాంకు ఓ అతి ముఖ్యమైన భాగస్వామి. రాష్ట్ర ఆర్థిక వ్యవహారాలకు, బడ్జెటుకు సంబంధించిన వివరాలన్నీ కూడా, ప్రజా ప్రతినిధి సభకు తెలియ చేయకముందే ప్రపంచ బ్యాంకు సలహాదారులకు, ఇంగ్లాండు సలహాదారులకు ముందరే వివరించబడి వారి సలహాల ప్రకారమే ఆర్థిక విధానం, బడ్జెటు రూపొందించ బడుతుంది. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ పరిపాలన సవ్యంగా కొనసాగడానికి, ప్రజా ప్రతినిధులు, అధికారులు మరియు న్యాయాధిపతులు మూడు అంగాలుగా భారత రాజ్యాంగం నిర్దేశించింది. సత్పరిపాలన కొరకు, అనుభవజ్ఞులైన అధికారులు విధాన సూచనలివ్వగా, వాటిని చట్టాలుగా ప్రజా ప్రతినిధులు రూపొందిస్తారు. అలా రాజ్యాంగానికే లోబడి రూపొందించబడిన చట్టాలు ప్రభుత్వం, ప్రజలు గౌరవించేటట్టు న్యాయాధిపతులు చేస్తారు. వీరినందర్నీ కాదని రాజ్యాంగాన్ని ఏమాత్రం ఖాతరు చేయకుండా సత్పరిపాలన కేంద్రాన్ని మన దేశ పరిస్థితుల అవగాహన ఏ మాత్రం లేని ఇంగ్లాండు సలహాదారులతో సహా ఓ రాజ్యాంగేతర కేంద్రాన్ని ఏర్పాటు చేయడం రాష్ట్ర ప్రజా ప్రతినిధులను, అధికారులను, న్యాయమూర్తులను ఏమీ తెలియనివారిగా పరిగణించికించపరచడమే.

భారత రాజ్యాంగంలో పొందుపరచబడిన ఆర్టికల్ 292 రాజ్యాంగం నుంచి తొలగించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కేంద్రాన్ని పలుసార్లు కోరడంలో ఆంతర్యం - విదేశాలతోనూ, విదేశీ సంస్థలతోను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వతంత్రంగా కేంద్ర ప్రభుత్వ ప్రమేయం లేకుండా ఆర్థిక పరమైన సంబంధాలు, అంగీకారాలు కుదుర్చుకొనడానికేనని విదితమే. అంటే ఆర్థికంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఓ స్వతంత్ర రాష్ట్రంగా రూపుదిద్దుకోవాలనే ఈ ప్రయత్నం. ఆర్థిక స్వాతంత్ర్యం రాజకీయ స్వాతంత్ర్యానికి నాంది అని అందరికీ తెలిసిందే. కాని ప్రపంచంలో ఏ దేశ రాజ్యాంగంలోను కూడా ఆ దేశ రాష్ట్రాలు స్వతంత్రంగా విదేశాలతో లావాదేవీలు జరుపడానికి వీలు కల్పించబడలేదు. అమెరికా రాజ్యాంగంలో ఒక రాష్ట్రం ఇంకొక రాష్ట్రంతో ఇటువంటి లావాదేవీలు జరుపాలన్నా కూడా ఫెడరల్ ప్రభుత్వం అంగీకారం ఉండాల్సిందే. రాష్ట్రాలకు ఆర్థిక స్వాతంత్ర్యం కనుక ఇస్తే దేశం చిన్న చిన్న స్వతంత్ర దేశాలుగా విచ్ఛిన్నమయి పోతుందన్న భావనతోనే ప్రపంచంలో ఏ దేశ రాజ్యాంగంలోను ఇటువంటి వీలు కల్పించలేదు.

కాని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటువంటి వీలు రాజ్యాంగ పరంగా కోరుకుంటున్నదంటే, ఈ దేశ సార్వభౌమత్వాన్ని ఐక్యతను విచ్ఛిన్నం చేసే ప్రయత్నమే. ఈ ప్రయత్నం పూర్తిగా ప్రపంచ బ్యాంకు అండదండలతోటే జరుగుతున్నది. ఇప్పటికే మన దేశానికి వస్తున్న వివిధ దేశాధిపతులను దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి చేయని విధంగా ఆహ్వానించి రాష్ట్ర ముఖ్యమంత్రి తనుకూడా ఓ దేశాధి పతయినట్లు వారితో రహస్యమంతనాలు జరుపడం అందరికీ విదితమే.

ఓ మూల ఆకలి చావులు, గ్రామాలను విడిచి భుక్తి కోసం పట్టణాలకు వలసపోతున్న శరణార్థులు. 58000 వేల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టినా కనీవిని ఎరుగని కరువు తీవ్రత, గుక్కెడు మంచినీళ్ళకే ప్రజల ఆరాటం, కప్పుకోడానికి బట్టపీలికలైనా నోచుకోని అనాధలు, పేవ్‌మెంట్ల మీద బ్రతుకులు సాగిస్తున్న దరిద్రులు, ఇంకొక మూల గోల్ఫ్ కోర్సులు, ఫార్ములా రేసింగు, సెవెన్‌స్టార్ హోటళ్ళు, మంచి స్కేటింగు రింగులూ, ఐమాక్స్ థియేటర్లు, కన్వెన్షన్ హాల్సు ఇత్యాదులు. ఇవన్నీ చూస్తే రోమ్ తగలబడుతూంటే నీరో ఫిడేలు వాయిస్తున్న కథను జ్ఞాపకం చేస్తున్నాయి. తినడానికి తిండి లేకపోయినా మీసాలకు సంపెంగ నూనె అన్నట్లు సామాన్య ప్రజానీకం జీవితపు కనీసపు అవసరాల కోసం అవస్థ పడ్తూ వుంటే అది కాదని షోకుల కోసమే వనరులన్నిటినీ ఖర్చు పెట్టే ప్రజాస్వామ్య ప్రభుత్వం ప్రపంచంలో ఎక్కడా లేదనే చెప్పాలి. 58000 వేల కోట్ల రూపాయలు అప్పుచేసినా, ఇంకా కోటానుకోట్ల రూపాయలు అప్పు చేస్తూనే వున్నా, ప్రజానీకానికి సరిపోయినంత త్రాగు నీరు ఇవ్వలేని ప్రభుత్వం దేశంలోనూ, విదేశాలలోనూ ప్రచారం కోసం ప్రతిష్ఠకోసం జాతీయ క్రీడలను, ఆఫ్రో ఏషియన్ క్రీడలకు ప్రజా ధనం కోటానుకోట్లు ఖర్చు పెట్టబడుతున్నది.

పర్యాటకుల కోసమే ఆంధ్రరాష్ట్రం ఉద్భవించినట్లు, పర్యాటక రంగం అంటూ నిత్యం మంత్రం వల్లెవేస్తూ పర్యాటకులు రాకపోతే జీవితమే లేనట్లుగా, ఈ రాష్ట్రాన్ని అంతర్జాతీయ విఖ్యాత పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం కంకణం కట్టుకుంది. రాష్ట్రంలో ఆకలితో ప్రజలు అల్లాడుతున్నా ఫర్వాలేదు. దాహమంటూ మొరపెట్టుకున్నా లాభం లేదు. ఆత్మహత్యలు పెరుగుతున్నా లెఖ్ఖలేదు. కరువు విలయతాండవం చేస్తున్నా ఖాతరు లేదు. ఈ ప్రభుత్వానికి ప్రపంచ బ్యాంకు ఆదేశాల ప్రకారం పర్యాట రంగం అభివృద్దే అతి ముఖ్యం. ఈ పర్యాటక రంగం కోసం ఖర్చుపెట్టబడే వేలకువేల రూపాయలు ఖర్చుతో బాగుపడేదెవరు? అంతర్జాతీయ పర్యాటక కేంద్రాలన్నీ కూడా అంతర్జాతీయ వ్యభిచార కేంద్రాలుగా కూడా వృద్ధి పొందుతాయని అందరికీ తెలిసిందే. అందుకే కాబోలు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కొన్నాళ్ళ క్రిందట వ్యభిచారాన్ని న్యాయపరమైన వృత్తిగా గుర్తించాలని, ఈ మధ్యనే వ్యభిచారిణులకు లైసెన్సులివ్వాలని వక్కాణించారు. అంటే బ్యాంకాక్‌తో సరితూగగల అంతర్జాతీయ పర్యాటక వ్యభిచార కేంద్రంగా హైదరాబాదు పేరు

ప్రఖ్యాతలు గడించబోతుందన్న మాట. పర్యాటకరంగ అభివృద్ధి ప్రపంచ బ్యాంకు ఆదేశాలకనుగుణంగా జరుగుతున్నది.

ఇంతవరకూ ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య తగ్గించాలనీ, ఖాళీగా ఉన్న ఉద్యోగులను భర్తీ చేయకూడదని, ప్రభుత్వ సంస్థలలో ఉద్యోగులకు స్వచ్ఛంద పదవీ విరమణ పథకాన్ని అమలు పర్చాలని అన్ని శాఖలలోను కాంట్రాక్టు పద్ధతి మీదే ఉద్యోగులను నియమించాలని ప్రపంచ బ్యాంకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మీద విధించిన షరతులలో భాగమే. అసలే నిరుద్యోగ సమస్యతోటి సతమతమవుతున్న రాష్ట్రంలో ఈ విధానంమూలంగా ఈ సమస్య విషమించడమే కాకుండా కొన్ని దుష్పరిణామాలకు దారితీయవచ్చును. రాజ్యాంగ పరంగా రిజర్వేషన్ వెసులుబాటున్న వర్గాలు ఆ వెసులుబాటును కోల్పోయి సాంఘిక ఘర్షణలు పెరగడానికి అవకాశం ఉంటుంది. అదీ కాకుండా ప్రపంచంలో ఏ దేశంలోనూ కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆచరించే విధానాన్ని ఏ ప్రభుత్వమూ ఆచరించటంలేదు.

రాష్ట్రాభివృద్ధి పేరిట, ప్రజల పేరుతో చేసిన వేలకువేల కోట్ల ద్వారా ప్రజలకొరిగిందేమిటి? హైటెక్‌సిటీలు, ఫ్లై ఓవర్‌లు పాఠ్య పుస్తకాలు లేని పాఠశాలలో కూడా కంప్యూటర్లు, మంత్రుల ప్రజా ప్రతినిధుల విదేశీ విహార యాత్రలు నయాపైసా కూడా ఆదాయం రాని ప్రాజెక్టులూను, ప్రజల జీవనస్థితిగతులు వీటి మూలంగా కించిత్తైనా మారలేదనేది అందరికీ తెలిసిన విషయమే. ప్రపంచ బ్యాంకు పాదం మోపిన దేశాలన్నిటిలోనూ బీదతనాన్ని రూపుమాపా లన్న నినాదంతో చేపట్టిన కార్యక్రమాలన్నీ కూడా బీద ప్రజల్నే రూపుమాపడానికి తోడ్పడుతున్నాయి. దేశంలోనే ప్రపంచ బ్యాంకు నుండి ఎక్కువగా అప్పుతీసుకున్న అగ్రగామి రాష్ట్రంగా పేరున్న ఆంధ్రప్రదేశ్, రైతుల ఆత్మహత్యలు, నేతపనివారల ఆత్మహత్యలు, విషయంలో కూడా అగ్రగామిగా పేరొందిందని అందరికీ తెలిసిందే.

పెదవి విప్పితే ప్రపంచ బ్యాంకు నామస్మరణ చేస్తూ అభివృద్ధి మంత్రాన్ని జపిస్తున్న ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వ పరిపాలనా దక్షతను ప్రజా శ్రేయస్సు మీద ప్రభుత్వానికున్న మక్కువను నిరూపించడానికే అన్నట్లు ఈ మధ్యే వెలువడిన భారతదేశ మానవాభివృద్ధి ప్రకారం మొత్తం అన్ని రాష్ట్రాలతో పోల్చి చూస్తే ఆంధ్రప్రదేశ్ ఈ విషయంలో 23వ స్థానంలో ఉంది. పెద్ద రాష్ట్రాలతోపోల్చి చూస్తే ఇంతకుముందు 1981, 1991లలో కూడా 8వ స్థానంలో వున్న రాష్ట్రాభివృద్ధి పరిస్థితి 9వ స్థానం నుంచి 2002 సం॥లో 10వ స్థానానికి పడిపోవడం గమనార్హం. వ్రతం చెడ్డా ఫలమైనా దక్కలేదన్నట్లు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ప్రపంచ బ్యాంకు ఆదేశాల కనుగుణంగా మలచుకొని, ప్రపంచ బ్యాంకుకే సామంత రాజ్యమా అన్నట్లు, ఆ బ్యాంకుకు అడుగులు మడుగులొత్తుతూ సార్వభౌమత్వాన్ని, పరిపాలనా స్వాతంత్ర్యాన్ని ప్రపంచ బ్యాంకుకు తాకట్టు పెట్టి, మానవాభివృద్ధి విషయంలో 1981 సం॥రం కంటే కూడా 2002 సం॥లో ఒక మెట్టు దిగజారిపోవడం ఈ రాష్ట్ర ప్రజలకే అప్రతిష్టకరమైనది. స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రాణాలకు కూడా వెరవకుండా బ్రిటీషు పరిపాలనను ఎదుర్కొన్న ఆంధ్రరాష్ట్ర ప్రజానీకం, స్వాతంత్ర్యం మా జన్మహక్కని, ఇంక్విలాబ్ జిందాబాద్ అని గర్జిస్తూ బ్రిటిషు నిరంకుశత్వ తూటాలకు ఛాతీలు చూపిస్తూ సవాలు చేసిన ఆంధ్రరాష్ట్ర ప్రజానీకం - ఈ రోజున రాష్ట్ర ప్రభుత్వం స్వాతంత్ర్యాన్ని సార్వభౌమత్వాన్ని ప్రపంచ బ్యాంకుకు తాకట్టు పెట్టగా మౌనంగా నిస్సహాయురాలిగా వుండడం ఎంతయినా విచారించ వలసిన విషయం.

వివిధ రాజకీయ పార్టీలు, దేశం కోసం, స్వాతంత్ర్యాన్ని, సార్వభౌమత్వాన్ని కాపాడడమే ధ్యేయంగా విభేదాలను విస్మరించి కలసికట్టుగా ప్రజల్ని ఉత్తేజపర్చి ఆంధ్రరాష్ట్రంలో ప్రపంచ బ్యాంకు పెత్తనానికి స్వస్తిచెప్పగల ఉద్యమానికి నాంది పలకగల సమయం ఆసన్నమయింది. ఇటువంటి ఉద్యమం ఏ వ్యక్తికి గాని, ఏ పార్టీకి కాని వ్యతిరేక భావాలతో కాకుండా, దేశగౌరవ ప్రతిష్టల కోసం పూర్తిగా ప్రజాస్వామ్య పద్ధతులతోను శాంతియుతంగాను సాగవలసిన అవసరం ఎంతయినా వుంది. అప్పులకంటె మనకు ఆత్మగౌరవం, స్వాతంత్ర్యం, సార్వభౌమత్వం ముఖ్యమని, ఇవే మన ప్రాణాలకు ఆధారమని, స్వాతంత్ర్యం, సార్వభౌమత్వం ముఖ్యమని, ఇవే మన ప్రాణాలకు ఆధారమని, ఇవి కాపాడడానికి ఎటువంటి త్యాగాలకైనా సిద్ధమని పాలకులకు, ప్రపంచ బ్యాంకులకు ఆంధ్ర ప్రజానీకం తెలియచేయ వలసిన సమయం ఇదే మరి. ○

స్వీకారం

- యుద్ధ నేరస్థులు బుష్-బ్లెయిర్ - పే. 100 వెల రూ. 15/-లు - ఎబికె పరిశీలన ప్రజా పంథా ప్రచురణలు
- ప్రపంచ యుద్ధం అనివార్యమా - పే. 32 వెల రూ. 6/-లు - సి.హెచ్. సాంబశివరావు, కోనేరువారి వీధి, పటమట మండపంవద్ద, విజయవాడ-520 010.
- కదలిక - నదుల అనుసంధానంపై ప్రత్యేక సంచిక - పే. 120 వెల రూ. 20/-లు - ఎస్. ఇమాం, డెమోక్రటిక్ యూత్ ఫోరం, అనంతపూర్.

మతోన్మాదానికి నిబద్ధతను ప్రకటించిన చింతన్ బైఠక్

- వి. కొమరయ్య

భారతీయ జనతాపార్టీ అగ్రనాయకులు ఇరవైఆరుమంది, ఒక రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ అగ్రనాయకుడు సాక్షిగా నాలుగు రోజులపాటు మేధోమథనం జరిపి 'పిల్లి అంటే మార్జాలం' అని తేల్చారు. భారతీయ జనతాపార్టీ ఎన్నికల వ్యూహాన్ని ఖరారు చేయడానికి జరిగిన ఈ శిఖరాగ్ర సమావేశం ఆ పార్టీ మతోన్మాద రాజకీయాల నుంచి ఇసుమంతైనా పక్కకు జరగడానికి సిద్ధంగా లేదని నొక్కి వక్కాణించింది.

నాలుగు సంవత్సరాలుగా భారతీయ జనతాపార్టీ నాయ కత్వంలో సాగుతున్న జాతీయ ప్రజాస్వామిక కూటమి ప్రభుత్వం పనితీరును సమీక్షించడానికి, ఈ సంవత్సరం చివర జరగనున్న శాసనసభ ఎన్నికలలో, వచ్చే సంవత్సరం జరగనున్న లోక్‌సభ ఎన్నికలలో పార్టీ వ్యూహాన్ని నిర్ణయించడానికి ఈ సమావేశం జరుపుతున్నామని భాజపా ప్రకటించినప్పుడు దేశవ్యాప్తంగా ఆసక్తి రేకెత్తింది. ప్రధాని, ఉపప్రధాని, కేంద్రమంత్రులు, పార్టీ అధ్యక్షుడితో సహా సీనియర్ నాయకులు పాల్గొంటున్న ఈ సమావేశం నిర్దుష్టమైన అంచనాలకు వస్తుందని, నిర్దిష్టమైన మార్గదర్శక సూత్రాలను ప్రకటిస్తుందని పరిశీలకులు భావించారు. కాని ఈ సమావేశం మేధోమథనం అని పెద్దపేరు పెట్టుకున్నప్పటికీ మేధనూ ఉపయో గించలేదు, మథనమూ చేయలేదు సరిగదా, అలవాటైన మతోన్మాద ఎత్తుగడలనే మళ్ళీఒకసారి ప్రకటించింది.

మహారాష్ట్రలోని థానే జిల్లాలో ఉత్తాన్ అనే గ్రామంలో భారతీయ జనతాపార్టీ జూన్ 18 నుంచి 20 వరకు నాలుగురోజులపాటు ఈ చింతన్ బైఠక్ జరిపింది. ఇందులో పార్టీ అధ్యక్షుడు ఎం. వెంకయ్య నాయుడు, ప్రధాని ఎ.బి. వాజ్‌పేయి, ఉపప్రధాని ఎల్.కె. అద్వానీ లతో పాటు గుజరాత్ ముఖ్యమంత్రి, గుజరాత్ మారణకాండ వ్యూహకర్త నరేంద్రమోడీ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రతినిధి మదన్‌దాస్‌దేవి తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో వాజపేయి మాట చెల్లుబాటవుతున్నదా, అద్వానీ మాట చెల్లుబాటవుతున్నదా అని వివాదం చెలరేగుతున్న సందర్భంలో జరిగిన ఈ సమావేశంలో ఆ ఇద్దరూ కలిసి పాల్గొంటారా లేదా అనేది చర్చనీయాంశమైంది. అయితే వాజపేయి ప్రారంభ సమావేశంలో మాత్రం పాల్గొని, ప్రారంభోపన్యాసం చేసి, చైనా పర్యటన నెపంతో మర్నాడు వెళ్ళిపోగా, అద్వానీ ప్రారంభ సమావేశానికీ రాలేదు. మర్నాడు కూడా వాజపేయి ఇంకాసేపట్లో వెళ్ళిపోతాడనగా వచ్చాడు. మొత్తంమీద ఇద్దరూ కలిసి కూచున్న సమయం చాలా స్వల్పం. ఆ తర్వాత రెండున్నర రోజుల సమావేశం అద్వానీ నేతృత్వంలోనే జరిగింది. చివరికి చింతన్ బైఠక్‌లో చివరి ఉపన్యాసం చేసిందికూడా అద్వానీయే. నాలుగురోజుల సమావేశంలో జరిగిన విషయాల గురించి వెంకయ్య నాయుడు ఇచ్చిన వివరణ చూస్తే అద్వానీ ఆధ్వర్యంలోనే మొత్తం వ్యవహారం నడిచిందని, మోడీ, ఆర్.ఎస్.ఎస్. ప్రతినిధి ఆమోదించిన విషయాలకే ప్రాధాన్యత లభించిందని అర్థమవుతుంది. వాజపేయికి ఎక్కువస్థానం లభించి ఉంటే విషయాలేవో మారేవనికాదు. అవి చెప్పే పద్ధతిలో కొద్దిపాటి మార్పులు మాత్రం ఉండేవి.

వాజపేయి ప్రారంభోపన్యాసంలో ఆత్మస్తుతి నిండిపోయింది. "వాతావరణం ఎన్.డి.ఎ. మిత్రపక్షాలకు అనుగుణంగా ఉంది. గెలుపే ధ్యేయంగా అసెంబ్లీ ఎన్నికలలో, సాధారణ ఎన్నికలలో పోరాడాలి. మూడింట రెండువంతుల మెజారిటీ సాధించడం మన లక్ష్యం. నాలుగు సంవత్సరాలలో మనం సాధించిన విజయాల్ని చెప్పాలి. భవిష్యత్ భారతం పట్ల దృష్టి ఏమిటో వివరించాలి" అని వాజపేయి అబద్ధాలు, అతిశయోక్తులు, పగటికలలు కలగలిసి ప్రకటించాడు. భాగస్వామ్య పక్షాలపై సమీక్ష జరపాలని ఒకవైపు అంటూనే రాష్ట్రాల్లో మిత్రపక్షాలకు అనుకూలమైన పరిస్థితి ఉందని అన్నాడు.

మిత్రపక్షాల మధ్య వైరుధ్యాలు, మిత్రపక్షాల అలకలు, బెదిరింపులు, చివరికి సొంత పార్టీలోనే అనేక లుకలుకలు బయటపడుతున్న సమయంలో వాతావరణం మిత్రపక్షాలకు అనుకూలంగా ఉందని వాజపేయి అనడం మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శించడమే. భాగస్వామ్య పక్షాలతో తృణమూల్ కాంగ్రెస్‌ను దాదాపు ప్రతిరోజూ బుజ్జగించవలసిరావడం, ఒకవైపు డి.ఎం.కె.తో పొత్తు కొనసాగిస్తూనే, ఎ.డి.ఎం.కె.తో పొత్తుకోసం అర్రులు చాచడం, రాష్ట్ర నాయకత్వం ఎంతగా వ్యతిరేకిస్తున్నా కేవలం కేంద్రంలో గద్దె నిలుపుకోవడం కోసం తెలుగుదేశం పార్టీతో వీడని బంధాన్ని కొనసాగిస్తుండడం-ఎన్.డి.ఎ. మిత్రపక్షాల మధ్య మైత్రి ఎంత సందేహాస్పదంగా, హాస్యాస్పదంగా ఉన్నదో చూపుతున్నాయి. ఈ నేపథ్యంలోనైనా భాగస్వామ్య పక్షాలమీద, వాటితో మైత్రిమీద నిర్మొహమాటమైన సమీక్ష లేకుండా, ఆత్మస్తుతి చేసుకోవడం భారతీయ జనతాపార్టీకి అధికార కాంక్ష ఎంత తీవ్రంగా ఉన్నదో రుజువు చేస్తోంది. సైద్ధాంతిక, సూత్రబద్ధ ఐక్యత కాకుండా కేవలం అధికారం, అవకాశవాద, దివాళాకోరు లాలూచీ మైత్రినే భాజపా కొనసాగించ దలచుకున్నదని చింతన్ బైఠక్ స్పష్టం చేసింది. ఈసారి లోక్‌సభ ఎన్నికలలో మూడింట రెండువంతుల ఆధిక్యత సాధించేటందుకు ఏ గడ్డి కరవడానికైనా సిద్ధమేనని ఉత్తాన్‌లో చర్చించిన మిషన్ 2004 నిస్సిగ్గుగా ప్రకటించింది. వివిధ రాష్ట్రాల్లో మిత్రపక్షాల విజయావ కాశాల పైనే దృష్టిపెట్టిన మిషన్ 2004, రాష్ట్రాల అధికారాన్ని

భాగస్వామ్య పక్షాలకు ఇచ్చి, కేంద్ర అధికారాన్ని భాజపాకు కట్టబెట్టే పన్నాగం పన్నింది.

ఈ నాలుగురోజుల ఆంతరంగిక, శిఖరాగ్ర సమావేశం తర్వాత, సమావేశ వివరాలను తెలియజేసేటప్పుడు అధ్యక్షుడు వెంకయ్యనాయుడు ఉపయోగించిన భాష, అందించిన సమాచారం భారతీయ జనతాపార్టీ దాని మాతృసంస్థ అయిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌కు, సంఘపరివారంలోని ప్రధాన శక్తులైన విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్‌లకు సంజాయిషీ ఇచ్చుకుంటున్నట్టుగా ఉన్నాయి గాని ఒక బాధ్యతాయుతమైన రాజకీయపార్టీ దేశ ప్రజల ముందర తన ఆలోచనలను పెడుతున్నట్లు లేవు.

రామాలయ నిర్మాణం, అధికరణం 370 రద్దు, ఉమ్మడి పౌరస్మృతి అనే తమ పాత ఎజెండాను ఎంతమాత్రం మార్చుకోవడం లేదని వెంకయ్యనాయుడు అన్నాడు. కాకపోతే దీన్ని ఎన్.డి.ఎ. ఎజెండాగా మార్చబోమని ఒక సన్నాయి నొక్కుమాత్రం నొక్కాడు. దాన్ని ఎన్.డి.ఎ. ఎజెండాగా చెయ్యబోమని అంటున్నప్పుడు, దాన్ని మళ్ళీ ఒకసారి ప్రకటించవలసిన అవసరమే లేదు. ఆ మూడు అంశాలూ కూడా భారతీయ జనతాపార్టీ మతోన్మాద రాజకీయాలలో భాగమే. అంటే 'మా మతోన్మాద రాజకీయాలను వదిలిపెట్టబోము, అయినా మాకు మద్దతు కొనసాగించండి' అని ఇతర రాజకీయ పక్షాలన్నిటికీ స్పష్టంగా తెలియజెప్పడమే ఇది. అయినా జార్జి ఫెర్నాండెజ్ నుంచి చంద్రబాబునాయుడు దాకా లౌకికవాదం గురించి ఎన్నిమాటలు చెప్పినా, అధికారదాహపు అవకాశవాదంతో ఈ మతోన్మాదాన్ని చూసీచూడనట్టు పోతారని భాజపా ధైర్యం. సరిగ్గా ఆ ధైర్యానికి తగినట్టుగానే, ఎన్.డి.ఎ. భాగస్వామ్య పక్షాలలోని ఒక్క పక్షమైనా, ఒక్క నాయకుడైనా ఈ ప్రకటన పట్ల తమ అభ్యంతరం వ్యక్తం చేయలేదు!

'అయోధ్యలో రామాలయ నిర్మాణం' అని విశ్వహిందూపరిషత్ అంటున్న మాటలనే తానుకూడా అంటున్నానని, తానేమీ మారలేదని అశోక్ సింఘాల్, ప్రవీణ్ తొగాడియా, గిరిరాజ్ కిశోర్ లాంటి వాళ్ళముందర చేతులు కట్టుకుని సంజాయిషీ ఇవ్వడం లాంటిది ఈ ప్రకటన.

ఒకవైపు బాబ్రీమసీదు వివాదాన్ని న్యాయస్థానాలే తేల్చాలని అంటూ, మరోవైపు లిబర్హాన్ కమిషన్ ముందర అభ్యంతరకరమైన వాంగ్మూలాలిస్తూ సంఘపరివారంలోని ఇతర సంస్థలను మరింత తీవ్రవాద చర్యలకు పురికొల్పుతూ భారతీయ జనతాపార్టీ ఒక గందరగోళాన్ని సృష్టించి తన ఎజెండాను కొనసాగించదలచుకుంది. బాబ్రీమసీదును కూల్చి ముస్లిం మత విశ్వాసాలను గాయపరిచి, సమాజంలో మత వైరుధ్యాన్ని తీవ్రతరం చేసి, ఆ ఘర్షణను వోట్లుగా మార్చుకోవడానికి, హిందూ వోటును తనవెనుక స్థిరంగా నిలుపుకోవడానికి పది సంవత్సరాలుగా చేస్తున్న ప్రయత్నం ఎంత మాత్రం ఆపేది లేదని చింతన్ బైఠక్ ద్వారా భాజపా స్పష్టం చేస్తోంది.

అధికరణం 370 రద్దు అనేది అర్థరహితమైన డిమాండ్ అని భాజపాకు తెలియక కాదు. 1953లో కాశ్మీర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసి షేక్ అబ్దుల్లాను నిర్బంధించినప్పుడే అధికరణం 370కి అర్థం లేకుండాపోయింది. నిజానికివాళ అధికరణం 370 ఔచిత్యం గురించి మాట్లాడాలంటే 1953కు ముందరి స్థితికి పోవాలి. కాని ఆరని కాశ్మీర్ చిచ్చు చూసి హిందూ–ముస్లిం ఘర్షణను పెంచడానికి ఈ అధికరణం 370ని భాజపా ఒక దిష్టిబొమ్మలా వాడుకుంటోంది.

ఉమ్మడి పౌర స్మృతి అనేది సామాజిక వైరుధ్యాలు, ఘర్షణలు తీవ్రస్థాయిలో ఉన్నప్పుడు సాధ్యమయ్యేది కాదు. కుల అంతరాలు ఉన్నంతకాలం రిజర్వేషన్ విధానం వంటి ఆరక్షణ ఎలా వుంటుందో, విడివిడి శిక్షా, న్యాయ విధానాలు అలా ఉండక తప్పదు. నిజంగా మత న్యాయ విధానం అమలులో ఉండడం వల్ల ఇబ్బందులు పడుతున్న వారిమీద ప్రేమతో కాక, కేవలం ఆ మత సమూహాన్ని బెదిరించడానికి ఉమ్మడి పౌరస్మృతి అనేదాన్ని వాడడం కేవలం మతోన్మాద రాజకీయమే.

అంటే భారతీయ జనతాపార్టీ తన మూలస్తంభాలుగా చెప్పుకుంటున్న మూడు నినాదాలు హిందూ మతోన్మాద పన్నాగాలే తప్ప వాటికీ ఒక లౌకిక, ప్రజాస్వామిక, బాధ్యతాయుత రాజకీయ పక్షానికి ఏ సంబంధమూ లేదు.

"అయోధ్యలో గొప్ప ఆలయాన్ని నిర్మించాలన్నది పార్టీ అభిప్రాయం. కాని అది ఎన్.డి.ఎ. ఎజెండాలో భాగం కాదు. అందువల్ల వచ్చే సాధారణ ఎన్నికల్లో దాన్ని ప్రచారాంశంగా ఉంచబోము" అని వెంకయ్యనాయుడు చేసిన ప్రకటన ఒక భాషాక్రీడ. తాను చెప్పదలచుకున్నది చెప్పి, చెప్పలేదనడానికి కూడా అవకాశం మిగుల్చుకుని, వినేవారికి తన అసలు ఉద్దేశ్యమేమిటో తెలిసేలా చేయడమే ఇది.

చింతన్ బైఠక్ కేంద్ర ప్రభుత్వానికి ఒక డిమాండ్‌ను, రాష్ట్ర ప్రభుత్వాలకు మరొక డిమాండ్‌ను కూడా ప్రకటించింది. గోవధ నిషేధ చట్టాన్ని ప్రవేశపెట్టాలని భారతీయ జనతాపార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుందట. మత మార్పిడుల నిషేధ చట్టాలు ప్రవేశపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తుందట.

కేవలం ఒక మతవర్గం గోమాంసం తింటుంది గనుక ఆ మతసమూహాన్ని బెదిరించే ఎత్తుగడగా గోవధ నిషేధం గురించి మాట్లాడడం సంఘ్‌పరివార్‌కు అలవాటైపోయింది. గోమాతపైన హిందీ రాష్ట్రాలలో ఉన్న భక్తి విశ్వాసాలను వోట్లుగా మార్చుకోవ డానికి ఎన్నో దశాబ్దాలుగా సంఘ్‌పరివార్ శక్తులు ఈ ప్రయత్నాలు చేస్తున్నాయి. నిజంగా దేశంలోని పశుసంపద బలహీనపడడానికి కారణమైన శక్తులేవో గుర్తించి, పశుసంపద అభివృద్ధికి అవసరమైన చర్యలేవీ తీసుకోని భాజపా ప్రభుత్వాలు కేవలం ముస్లింల మనోవిశ్వాసాలు గాయపరచడానికే మాటిమాటికీ గోవధ నిషేధం ప్రస్తావన చేస్తున్నాయి. *(తరువాయి భాగం 9వ పేజీలో)*

ధనిక దేశాల్లో ఆర్థిక మాంద్యం

- డి. పాపారావు

ఈ సంవత్సరం మొదటి 3 నెలల కాలానికిగాను స్థూల జాతీయ ఉత్పత్తి తాలూకు గణాంక వివరాలను అమెరికా ప్రభుత్వం ప్రకటించింది. ఈ మొదటి మూడునెలల కాలంలో అమెరికా ఆర్థిక వ్యవస్థ 1.6% వార్షిక రేటున వృద్ధిచెందింది. గత సంవత్సరపు చివరి 3 నెలల కాలంలోని 0.8% వృద్ధిరేటు కంటే ఇది ఎక్కువే. అయితే గతంలో అమెరికా ఆర్థిక వ్యవస్థ సాధించిన 4-5% వృద్ధిరేటుకంటే ఇది చాలా తక్కువ. అంటే 2001వ సంవత్సరంతో ఆరంభం అయిన ఆర్థిక మాంద్య పరిస్థితులు 2002వ సంవత్స రంలో కొద్దిగా తగ్గుముఖం పట్టినా, అవి నేడు మరలా 2003వ సంవత్సరంలో తిరిగి పెరిగిపోతున్నాయి. అంటే ఆర్థిక వేత్తల పరిభాషలో అమెరికా నేడు "రెట్టింపులోతు పతనం"లోకి వెడుతోంది.

పారిశ్రామిక ఉత్పత్తిరంగం, మిగతా ఆర్థికరంగంలోని ఆర్థిక కార్యకలాపాలు కూడా పతనం అవుతున్నాయి. అమెరికా కార్పొరేట్ సంస్థలలో ఉపాధిపై వేట్లు కొనసాగుతున్నాయి. గత రెండునెలల కాలంలోనే 4,50,000 మంది ఉద్యోగులు ఉపాధిని కోల్పోయారు.

ఇరాక్ యుద్ధఫలితం ఎలా వుంటుందోనన్న ఆందోళన, భయాల వలన ఇలా జరగలేదు. అయితే అలన్ గ్రీన్‌స్పాన్ (ఫెడరల్ బ్యాంకు ఛైర్మన్) మాత్రం ఈ వాదననే ముందుకు తెస్తున్నాడు. ఇరాక్‌లో విజయం లభించిన అనంతరం, అమెరికా ఆర్థికవ్యవస్థ అంతర్గత "బలం" మరలా విజృంభిస్తుందని ఆయన చెబుతూ వచ్చాడు. స్టాక్ మార్కెట్ కోలుకోవడంతో, మరికొన్ని వడ్డీరేట్ల తగ్గింపులతో సుసంపన్నత, ఉద్యోగాలు తిరిగి మరలా వచ్చేస్తా యనేది ఆయన ఊకదంపుడు.

అయితే ఈ వాదనకు తగినన్ని ఆధారాలు లేవు. ఇరాక్‌పై "యుద్ధ" (దాడి) విజయం అనంతరం స్టాక్‌మార్కెట్ కొద్దిగా పుంజుకున్న మాట నిజమే. అయితే నేడు బలహీనమైన ఆర్థిక వ్యవస్థ, కరెన్సీల తాలూకు వాస్తవాలు మదుపుదారులను కలవరపెడుతున్నాయి.

అమెరికా ఆర్థికవ్యవస్థ పునరుత్తేజానికి మూలంగా వుండగలది, వినియోగదారులు తమ డబ్బును కొనుగోళ్ళకు వెచ్చించేందుకు సిద్ధపడడమే. నూతన శతాబ్ద ఆరంభంలో హైటెక్ బుడగ తాలూకు పెట్టుబడులు కృంగిపోయిన తరువాత, స్టాక్‌మార్కెట్లు పతనం అయ్యాక వినియోగదారులు విపరీతంగా కొనుగోళ్ళు చేశారు. ఉద్యోగాలపై వేటు, పతనం అవుతున్న డాట్‌కామ్‌లు, పలు కంపెనీల దగా, దివాళాల తరువాత వినియోగదారులు ఈ కొనుగోళ్ళను ఎలా చేయగలిగారు?

దీనికి కారణం అమెరికా ఆర్థికవ్యవస్థలోని మరో బుడగ పెద్దది అవుతూ సాగడమే. గృహాల ధరలు సగటున 7 నుంచి 10 శాతం రేటున పెరుగుతూపోయాయి. గృహాల కుదువరేట్లు తగ్గడం వలన, గృహ యజమానులు రీఫైనాన్సింగ్ ద్వారా డబ్బును పొదుపు చేసుకోగలగడం దీనివెనుకన వున్నది. అలాగే తక్కువ రేట్లకు రీఫైనాన్స్ చేసుకునేసమయంలో వారు అదనపు డబ్బును రుణంగా తీసుకోగలిగారు. దీని ఫలితంగా వారివద్ద అదనంగా డబ్బు చేరింది. ఇది ఒకేమారు లభించే ఆదాయం మాత్రమే. అయితే ఇది వినియోగదారుల కొనుగోళ్ళ కొనసాగింపును సాధ్యపడేలా చేసింది. ఈ కొనుగోళ్ళు ప్రధానంగా కొత్త కార్లను కొనడం రూపంలో జరిగాయి. జనరల్ మోటార్స్, ఫోర్డు కంపెనీలు పోటాపోటీగా డిస్కౌంటు రేట్లకు కార్లను అమ్మాయి. తద్వారా తమ అమ్మకాల స్థాయిని కాపాడుకో చూసాయి. ఈ విధంగా అమ్మకాలు అయితే పెరిగాయి కానీ, లాభాలు తగ్గిపోయాయి. 1997వ సంవత్సరం నుంచీ అమెరికా కార్పొరేట్ సంస్థల లాభాలు పడిపోతున్నాయి. అమ్మకాలపై లభించే లాభాల మార్జిన్లు మునుపెన్నడూ లేనిస్థాయికి తగ్గిపోయాయి. తమ కొనుగోలుదారుల నుంచి కంపెనీలు వసూలుచేస్తోన్న ధరలు, 1958వ సంవత్సరం అనంతరం నేడు అతివేగంగా పడిపోతున్నాయి. అమెరికా ప్రజలు దుకాణాలకు (షాపింగ్ మాల్స్) కొనుగోళ్ళకై పోతున్నారు. అయితే సరుకులను సరఫరాచేసే రిటైలర్లు, ఉత్పత్తిదారులకు లాభంగా మిగులుతున్నది నామమాత్రమైపోతోంది. ఈ పరిస్థితి ఎల్లకాలం కొనసాగజాలదు, కొనసాగలేదు. కంపెనీలు కార్మికులను ఉపాధినుంచి తొలగించ సాగాయి. వేతనాల పెరుగుదలలను నిలిపివేశాయి. పనిగంటలు పెరుగుతున్నాయి. నూతన సాంకేతిక పరిజ్ఞానంపై పెట్టుబడుల కోతలద్వారా తిరిగి లాభార్జనకు తాపత్రయపడుతున్నాయి. దీని ఫలితంగా ఆర్థికవ్యవస్థ మాంద్యంలోకి వెళ్ళిపోతోంది. ఇక ఇప్పుడు ఈ ఉపాధికోతలు గనుక అమెరికా గృహస్థుల వ్యయంపై వేటువేస్తే, తమ ఇళ్ళను కుదువబెట్టి వారు రుణాలు తీసుకోవడం మానివేస్తే ఈ గృహాల రీఫైనాన్సింగ్ బుడగ కూడా పగిలిపోతుంది. అమెరికా ఆర్థికవ్యవస్థ పతనంలోకి జారిపోతుంది.

వడ్డీరేట్లను తగ్గించడం ద్వారా ఫెడరల్ బ్యాంకు, భారీ పన్ను రాయితీల ద్వారాను, యుద్ధసామాగ్రిపై వ్యయం ద్వారా బుష్‌లు మాంద్యాన్ని నిలువరించేందుకు ఆతృతపడుతున్నారు. అయితే ఈ విధంగా వారు మాంద్యాన్ని ఎంతోకాలం నిలువరించలేరు.

అమెరికా ఆర్థికరంగం పెట్టుబడిదారీ ప్రపంచ ఆర్థికవ్యవస్థకు ఆయువుపట్టుగా వున్నది. అమెరికాకు గనుక జలుబుచేస్తే మిగతా ప్రపంచానికి సార్స్ వస్తుంది. ఇప్పటికే యూరప్ ఆర్థికమాంద్యంలో వున్నదని సర్వేలు చెబుతున్నాయి. జపాన్ పరిస్థితి ఇక వేరే చెప్పనవసరంలేదు. జపాన్ స్టాక్ మార్కెట్ నేడు గత 20 సంవత్సరాల కాలంలో ఎప్పుడూ లేనంత దిగువ పరిస్థితిలో వున్నది. ఏదేమైనా ప్రపంచంలోని పెట్టుబడిదారీ అనుకూల రాజకీయవేత్తలు మాత్రం ఇప్పటికీ పైకి బింకంగానే వున్నారు. అయితే వాస్తవికవాదులైన ఆర్థిక పరిశీలకులు మాత్రం పరిస్థితి ఆందోళనకరంగా వుందని వాపోతున్నారు. ఈ సంవత్సరం (2003) యూరప్, జపాన్‌ల స్థూల జాతీయ ఉత్పత్తి పెరుగుదల 1% లోపే వుంటుందనీ, అమెరికాకు ఇది కేవలం 2% మాత్రమే వుంటుందనీ వారి అంచనా. కాగా, వాస్తవానికి ఆ జాతీయ వ్యవస్థలు ఆ స్థాయి అభివృద్ధినైనా సాధించడం సందేహాస్పదమే.

మచ్చుకు ప్రపంచ వాణిజ్య సంస్థ అభిప్రాయాన్నే పరిశీలిద్దాం. గత సంవత్సరం సరుకుల రంగంలో ప్రపంచ వ్యాపారం 2.5% పెరిగిందని ఆ సంస్థ అంచనా. 2001వ సంవత్సరపు 1% తగ్గుదలతో పోలిస్తే ఇది మెరుగే. అయితే ప్రస్తుత 2003వ సంవత్సరానికి ఈ సంఖ్య కేవలం 3%గా వుంటుందని ఆ సంస్థ అంచనా. ఈ రేటు 1990వ దశకపు స్థాయికంటే చాలా తక్కువ. కాగా ఇది స్థూల జాతీయోత్పత్తి అంచనాల కంటే మెరుగ్గానే వుంది. అంటే విడివిడిగా పెట్టుబడిదారీ దేశాలు ఆర్థికమాంద్యం నుంచి బయటపడేందుకు గాను ఎగుమతులు చేయడం, పెంచడం అనే పనిముట్టుపై ఆధారపడలేవు. కాగా పోగా మార్కెట్‌లకై పోటీ మరింత తీవ్రతరం కానున్నది. వాణిజ్య వివాదాలు, రక్షిత ఆర్థికవ్యవస్థల చర్యలు వేగం పుంజుకోనున్నాయి.

ఇరాక్‌లో సైన్యం కొనసాగింపుకు, పునర్నిర్మాణానికి అమెరికా ప్రభుత్వం భారీగా ఖర్చుపెట్టవలసివుంటుంది. ఇక ఉత్తర కొరియాపై కూడా అమెరికా దాడికి దిగితే పరిస్థితి చెప్పనవసరంలేదు. అమెరికా పౌరులపై భారీగా పన్నులు మోపబడతాయి. లేదా డాలరు విలువ పడిపోతుంది లేదా మరింత దారుణంగా ఈ రెండు విపత్తులూ అమెరికా సామాన్య ప్రజలపై మూలిగే నక్కపై తాటికాయలా పడవచ్చు.

ప్రపంచ ఆర్థికవ్యవస్థకు ఇంజన్ల వంటి అమెరికా, యూరప్, జపాన్‌ల పరిస్థితి ఇలాగే దిగజారితే ఇక అభివృద్ధి చెందిన దేశాలకు ఎగుమతులపై ఆధారపడిన ఆసియా, లాటిన్ అమెరికా దేశాల పరిస్థితిని వేరే చెప్పనవసరం లేదు. వీటికి తోడుగా ఆసియా దేశాల ఆర్థిక వ్యవస్థలపై సార్స్ వ్యాధి చావుదెబ్బను తీసింది. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్త ఆర్థికమాంద్యం మరింత లోతులకు వెళ్ళే అవకాశాలే ఎక్కువని మనం గుర్తించాలి. ఈ మాంద్యానికి ప్రతిస్పందనగా ప్రపంచంలోని వివిధ దేశాలలో రక్షిత ఆర్థిక విధానాం తలెత్తే అవకాశం వుంది. ఇది 1930ల నాటి ఆర్థికమాంద్య పరిస్థితులను పోలింది. ఈ పరిస్థితిలో పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రపంచంలో నూకలు చెల్లిపోవడానికి మరెంతో దూరం లేదనిపిస్తోంది. ○

(7వ పేజీ తరువాయి)

మతమార్పిడి నిషేధ చట్టం ఇప్పటికీ తమిళనాడులో అమలులో ఉండడంతో దానివల్ల రాజ్యాంగం హామీ ఇచ్చిన మతస్వేచ్ఛ ఎట్లా కాలరాచివేయబడుతున్నదో ఇప్పటికే ఎన్నో పరిశీలనలు వెలువడ్డాయి. మతమార్పిడి ఎందువల్ల జరుగుతున్నదో, హిందూ సమాజంలోని ఏ అంతరాలు, ఏ పీడన, ఏ దౌష్ట్యం కొన్ని సెక్షన్ల ప్రజలను మరో మతంవైపు చూసేలా పురికొల్పుతున్నదో గమనించకుండా, ఒక చట్టం ద్వారా ఈ ఆలోచనలను అరికట్టాలని చూడడం నిరంకుశం. భారతీయ జనతాపార్టీ అటు దుర్మార్గమైన హైందవ బ్రాహ్మణ్య మనుధర్మానికీ, ఇటు నిరంకుశమైన భూస్వామ్యానికీ పుట్టి ఇప్పుడు కొత్తగా ప్రపంచీకరణ సామ్రాజ్యవాద శక్తుల ప్రాపకంలో పెరుగుతున్నది గనుక ఈ నిరంకుశత్వం సహజమే.

స్వదేశీ, స్వదేశీ అని ఎన్నో దశాబ్దాలుగా నినదిస్తూవచ్చి, అధికార పీఠంకోసం నిర్లజ్జగా ప్రపంచీకరణను సమర్థిస్తూ దేశాన్నే విదేశాలకు తాకట్టుపెడుతున్న భారతీయ జనతాపార్టీ చింతన్ బైఠక్ సోనియా గాంధీ విదేశీయత గురించి కూడా మాట్లాడింది. సోనియాగాంధీ పుట్టుకతో విదేశీయురాలే కావచ్చు, రాజకీయార్థిక విధానాలతో విదేశీయుల అడుగులకు మడుగులొత్తుతున్న భాజపాకు సోనియా విదేశీయతను ప్రశ్నించే నైతిక అర్హత ఉందా? ఈ పాత చింతకాయ పచ్చడి వాదన ద్వారా, ప్రజలలో ఉన్న దేశభక్తిని, స్వాభిమానాన్ని సొమ్ముచేసుకోవడానికి భాజపా ప్రయత్నిస్తోంది.

ఏయే అంశాల గురించి ఏమి చర్చించినా, బహిరంగ ప్రకటనలలో ఏమి చెప్పినా అంతిమంగా తాను ఈ దేశంలోని మతోన్మాద శక్తులతో విడదీయరాని భాగాన్నని భారతీయ జనతా పార్టీ మరొకసారి చింతన్ బైఠక్ తర్వాత స్పష్టం చేయదలచుకుంది. "విశ్వహిందూ పరిషత్‌తో సహా సంఘ్ పరివార్ సంస్థలన్నిటితో సమన్వయం, సంబంధాలు పెంచుకోవాలని చింతన్ బైఠక్ నిర్ణయించింది" అని వెంకయ్యానాయుడు అన్న మాటకు వివరణ అవసరం లేదు. ○

బంజరుభూములు కార్పొరేట్ రంగం సమర్పయామి

- వి. హనుమంతరావు

దేశంలో 500 లక్షల హెక్టార్ల బంజరు భూములున్నాయి. ఈ భూముల వ్యవహారాలను చూడటానికి కేంద్రంలో గ్రామీణాభి వృద్ధి మంత్రిత్వ శాఖలో భూవనరుల విభాగం ఒకటి వుంది. ఈ విభాగానికి 11వ ప్రణాళిక ఆఖరునాటికి 240 లక్షల హెక్టార్ల బంజరు భూములను వినియోగంలోకి తీసుకొని రావాలనేది లక్ష్యం. 10వ ప్రణాళికలో 18 లక్షల హెక్టార్ల భూమి లక్ష్యం కాగా ఆచరణలో 'చాలా తక్కువ' భూమిని మాత్రమే వినియోగంలోకి తీసుకొనిరాగలిగింది. ఇంత బృహత్ కార్యక్రమం అమలు పరచాల్సిన బాధ్యత ఈ విభాగంమీద వున్నా ప్రణాళికా సంఘం కేటాయింపులు అందుకనుగుణగా లేవు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఈ నత్తనడక వ్యవహారం పట్ల అసంతృప్తిని వ్యక్తం చేస్తూ, లక్ష్యానికి ధీటుగా కేటాయింపులు చేయాలని ప్రణాళికా సంఘాన్ని మరోసారి కోరింది. స్టాండింగ్ కమిటీ ఇలా గత సంవత్సరాల్లో కూడా సిఫార్సుచేస్తూ వచ్చినా, కేటాయింపులు పెంచుతూ వచ్చినా, ఆ కేటాయింపులు సముద్రంలో బొట్టులాగే వుంటున్నాయి.

చేసే కేటాయింపులే చాలలేదని కమిటీ అంటుంటే, ఈ కేటాయింపుల్లో ఆర్థిక మంత్రిత్వశాఖ 9వ ప్రణాళికా కాలంలో ప్రతి సంవత్సరం కోత విధిస్తూనే వచ్చింది. ఉదాహరణకు 8వ ప్రణాళికలో రూ. 108 కోట్లు, 9వ ప్రణాళికలో రూ. 302 కోట్లు ఖర్చు కాలేదు. మంత్రిత్వశాఖ చేసిన కేటాయింపులను పూర్తిగా ఖర్చుచేయకపోతే, ప్రణాళికా సంఘం కేటాయింపును ఎలా పెంచుతుంది అని స్టాండింగ్ కమిటీ ప్రశ్న.

బంజరు భూముల అభివృద్ధి విషయంలో ఎదుర్కొంటున్న మరో సమస్య ఈ అభివృద్ధి కార్యక్రమాన్ని అనేక మంత్రిత్వశాఖలు, విభాగాలు చేపట్టడం. ఇది సరికాదు, ఈ బాధ్యతను ఒకేఒక మంత్రిత్వశాఖకు ఇవ్వాలని స్టాండింగ్ కమిటీ గత నాలుగైదు సంవత్సరాలుగా ప్రతీ ఏడాది సిఫార్సు చేస్తూనేవుంది. ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరిస్తూనే వుంది. అయినా, ఆ పని జరగటం లేదు. ఇదిగో వచ్చే రెండు నెలల్లో నిర్ణయం తీసుకుంటున్నాం అని ఆ శాఖ కార్యదర్శి చెప్పి సంవత్సరం అయినా, ఇంకా ఏమీ జరగలేదు. మూడు నెలల్లోగా ఈ విషయంలో ప్రభుత్వం ఒక నిర్ణయానికి రావాలని కమిటీ కోరింది. తమపార్టీ ప్రయోజనాల కోసం నిముషాలమీద నిర్ణయం తీసుకునే కేంద్రం పేదప్రజలకు లాభించే బంజరుభూముల విషయంలో ఎందుకు ఇంత ఆలస్యం జరుపుతున్నదంటే, దానికి కారణం కోసం ఎంతోదూరం పోనవసరం లేదు. ఈ భూములను ఎలాగో ప్రైవేటురంగానికి ధారాదత్తం చేయాలి. వాళ్ళకు ధారాదత్తం చేయటానికి ఒకసాకు కూడా పాలకులకు రెడీగా వుంది. ఇన్ని కోట్ల హెక్టార్ల భూమిని వినియోగం లోకి తీసుకొనిరావడానికి ఎన్నివందల కోట్ల రూపాయలు కావాలి. డబ్బులేదు, ప్రైవేటు రంగానికిచ్చేస్తే వాళ్ళే పెట్టుబడి పెడతారు. ప్రపంచ బ్యాంకు కళ్ళు చల్లబడతాయి. ఈ భూములమీద కన్నువేసిన కార్పొరేటు సంస్థలు ఎగిరిగంతేస్తాయి. ఈ పార్లమెంటరీ కమిటీ పైన పేర్కొన్న విషయాల్లో కన్నీరు కార్చటం ఈ భూములనెలాగైనా ప్రైవేటు రంగానికి కట్టబెట్టడానికనేది స్పష్టం. ప్రైవేటు రంగానికి ఆకర్షించడానికి ఏం చేయాలో, ఏం చర్యలు తీసుకోవాలో మేము ఇదివరకే సూచించాం, ఎందుకు చర్యలు తీసుకోలేదని కమిటీ ప్రశ్నించింది. ఆ దిశగా ప్రభుత్వం ఇదివరకే పయనిస్తుండడం వల్లనే తుది నిర్ణయం ఆలస్యమైందని ప్రభుత్వాధికారుల జవాబు తెలియచేస్తుంది. దేశంలో కార్పొరేటు పారిశ్రామికవేత్తల సంస్థలైన సి.ఐ.ఐ., అస్సోఛామ్‌తో చర్చలు కొనసాగిస్తున్నారట. ఈ చర్చల్లో భాగంగా రిజర్వుబ్యాంకు, నాబార్డ్ లాంటి సంస్థలతో కూడా సమావేశం జరిపింది. దేశంలో వివిధ ప్రాంతాల్లో సమావేశాలు కూడా జరిపింది. బ్యాంకులు, ఆర్థిక సహాయ సంస్థలు, కార్పొరేట్ రంగం, ప్రోగ్రెసివ్ రైతులు ఈ సమావేశాల్లో పాల్గొన్నారు. పార్లమెంటరీ కమిటీమీద ఎటువంటి ఒత్తిడులు ఎవరు చేస్తున్నారో గాని "వర్క్‌షాపులు, సెమినార్లు పెట్టి చర్చిస్తే ప్రైవేటు రంగం ముందుకు రాదని, బంజర్లను సాగు చేయటంలో ఆసక్తి కనపరిచే కాగితం పరిశ్రమల వారితో చర్చించాలని, ఆర్థిక, పారిశ్రామిక మంత్రిత్వశాఖల ద్వారా కార్పొరేట్ రంగంతో సంప్రదించాలని కమిటీ సూచించింది.

ఈ సందర్భంగా ఒక విషయం గుర్తు చేసుకోవాలి. భూమిలేని నిరుపేదలకు బంజరు భూములు పంచాలని, వాటిని సాగులోకి తీసుకొనిరావడానికి ఆర్థిక సహాయం చేయాలని వామపక్షాలు, ప్రజాసంఘాలు కోరుతూ వచ్చాయి. కంటితుడుపుగా ఈ రెండు పనులూ చేయడానికి ప్రభుత్వం చట్టం చేసింది కాని అవి కాగితం మీదే ఉండిపోయాయి.

భూసంస్కరణలు అమలుచేయటం ఈ ప్రభుత్వానికి ఎలాగూ సాధ్యం కాదు. కనీసం బంజరు భూములనైనా పంచిపెడితే ఆ నిరుపేదలు తమ శ్రమనే పెట్టుబడిగా పెట్టి కొద్ది ప్రభుత్వ సాయంతో బంగారు పంటలు పండించి, దేశంలో ప్రతీఒక్కరూ తిన్నా సరిపోయి నంత పంట పండించవచ్చు. కోట్లాది పేదప్రజల కొనుగోలుశక్తి పెరిగి, పారిశ్రామికోత్పత్తులకు గిరాకీ ఏర్పడివుండేది. బంగారం లాంటి ఇటువంటి పరిష్కారాన్ని కాలదన్ని, ఆలా కోరినవారిని తుపాకీ

కాల్పులతో అణచివేసి, కార్పొరేట్ సంస్థలతో చర్చలు చేస్తున్నారంటే ఇదెవరి ప్రభుత్వమే ఇట్టే అర్థమైపోతుంది. పేద ప్రజలకు అనుకూలమైన ఈ పరిష్కారాన్ని విడనాడి ప్రపంచ బ్యాంకుతో ఈ భూముల వినియోగం గురించి చర్చలు జరుపుతుందట. ఆ సంస్థ సానుకూలంగా స్పందించిందట. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాలు డి.ఎఫ్.ఐ.డి. సహాయంతో రెండు ప్రాజెక్టులు అమలుపరుస్తున్నాయట. పార్లమెంటరీ కమిటీలోని సభ్య మహాశయులు గుస్సా అయిపోయారు. జాతీయ భూమి వినియోగ విధానం ఒకటి తయారవుతుందని చెప్పి సంవత్సరమైనా ప్రభుత్వం నిద్రపోతుందని తప్పుపట్టారు. ప్రపంచబ్యాంకు సానుకూలంగా స్పందించిన తర్వాత కూడా ఇంత ఆలస్యమేమిటని వెంటనే విదేశీ సహాయాన్ని తీసుకొని వాటర్‌షెడ్ పథకాలను కూడా అమలుపరచాలని సూచించింది. అవునుమరి కేవలం బంజరు భూములను కార్పొరేట్ సంస్థలకు ఇవ్వటమే కాకుండా వాటర్‌షెడ్లు అభివృద్ధి చేస్తే, ఆ సంస్థలు వచ్చి వడ్డించిన విస్తరిముందు కూర్చొని ఆరగిస్తారు. మా శ్రమశక్తితో బంజరుభూములను సస్యశ్యామలం చేస్తామని అంటుంటే, ఈ భూములమీద విదేశస్థులకు పెత్తనం అప్పగిస్తానంటుందేమిటి?

ఇలా ధారాదత్తం చేయాలంటే, 1894 స్వాధీన చట్టం అడ్డం వస్తుంది. అందుచేత దానికి సవరణ తీసుకొనిరావాలని కమిటీ అంటోంది. కమిటీ సిఫార్సుకోసం ప్రభుత్వం మీనమేషాలు లెక్కపెడుతూ కూర్చోలేదు. సవరణ చట్టం తయారుచేసి చిత్తుప్రతిని పంపగా న్యాయశాఖ పరిశీలిస్తుందని అధికారులు కమిటీకి తెలియజేశారు. ఈ భూములను ప్రైవేటురంగానికి బదలాయిస్తే నిర్వాసితులైనవారికి పునరావాస కార్యక్రమం గురించిన విధాన ప్రకటన కూడా తయారవుతోంది.

దున్నేవానికే భూమికోసం, విప్లవాత్మక భూసంస్కరణల కోసం, బంజరుభూముల పంపిణీ కోసం దశాబ్దాలుగా సాగుతున్న ఆందోళనకు స్పందించటం పోయి, ఆ పథకానికి గోతులు తవ్వి పూడ్చిపెట్టడానికి, దానిమీద కార్పొరేట్ సంస్థల భవన నిర్మాణానికి తెరవెనుక నిశ్శబ్దంగా ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకొంటూంది. దేశాభివృద్ధి కోసం, ఆహారపంటల స్వయం పోషకత్వం కోసం, ఉపాధికోసం ప్రభుత్వ ప్రయత్నాన్ని వ్యతిరేకించాలి. ○

వినదగునెవ్వరు చెప్పిన...

అంతర్జాతీయంగా హోటల్ రంగం పోటీలో నిలవాలంటే, ఈ రంగాన్ని భారతీయులే నడపాలి. యాజమాన్య బాధ్యత భారతీయుల చేతుల్లోనే వుండాలి. విదేశీ హోటల్ సముదాయాలతో భారతీయులు చేసుకునే ఒప్పందాలు ఎక్కువగా విదేశస్తులకే అనుకూలంగా వుంటాయి. అంతర్జాతీయ హోటల్ సముదాయాలతే ఒప్పందాలు చేసుకుంటే, వాటిని మార్కెటింగ్‌కు మాత్రమే పరిమితం చేయాలి, యాజమాన్యం మాత్రం చేతులు మారకూడదు. ఈ ఒప్పందాల్లో చాలా ఎక్కువగా భారతీయ పార్టనర్‌ను సుదీర్ఘకాలం పాటు కట్టిపారవేస్తాయి. అలాంటి ఒప్పందాలు లాభాలను విదేశాలకు తీసుకొనిపోతాయి. ఆ మోటల్ విస్తరణకు చేసిన అప్పులు తీర్చడానికి కావల్సినంత ఆదాయాన్ని మిగల్చవు".

సి.కె.కృష్ణన్ నాయర్, లీలాగ్రూప్ హోటల్స్

"భారతదేశంలో ప్రతిఏటా అప్పుడే పుట్టిన పిల్లల్లో 7 శాతం మంది అప్పుడే చనిపోతున్నారు. ప్రతి వెయ్యి జననాలకు దేశంలో 68.6 పిల్లల మరణాలు సంభవిస్తుంటే, అవి చైనాలో 27.8, ఇండోనేషిలో 39.4, ఫిలిప్పైన్స్‌లో 29.8 మంది మాత్రమే చనిపోతున్నారు (2002 లెక్కలు). తల్లి అనారోగ్య, పోషకాహార లేమి, విరోచనాలు, ఊపిరితిత్తుల వ్యాధులు ప్రధాన కారణాలు".

ఎకనామిక్ టైమ్స్ ఇంటెలిజెన్స్

"నీటిని పంపకంచేసే బాధ్యత లాభాలకోసం చూసే ప్రైవేటు రంగానికి అప్పచెప్పడం సాధ్యమూకాదు, అభిలషణీయమూ కాదు".

ఎ. వైద్యనాథన్, ప్లానింగ్ కమిషన్ సభ్యుడు

"ప్రపంచంలో మూడోవంతు రోగాలు వాతావరణ కాలుష్య కారణంగా వస్తున్నాయి. వాటిలో 40 శాతం అయిదు సంవత్సరాల లోపు బాలబాలికలు గురవుతున్నారు. కాలుష్య సమస్యల మూలంగా 50 లక్షలమంది పిల్లలు ప్రతీఏటా చనిపోతున్నారు".

డా॥ అలెగ్జాండర్ వాన్ హిల్డెబ్రాండ్, ప్రపంచ ఆరోగ్య సంస్థ

"రసాయనిక ఎరువులు కావాలి. నాణ్యత నిశ్చితి, మొత్తుకోలు- విచారణ. రసాయనిక ఎరువు క్రిములను కలిగిస్తుంది. బూటకపు క్రిమినాశకాలు! పంట పురుగు తినిపోతుంది. ఇస్తావా, చస్తావా? అని ఇంటిముందు అప్పులవాళ్ళు. ఏం చెయ్యాలి రైతు? గత్యంతరం లేక ఆత్మహత్య! అన్యుల తప్పులకు, అవినీతికి రైతు బలిపశువు. రైతుచావుకు ఎవరు బాధ్యులు? వర్తకం- పరిశ్రమలు- రాజకీయం- శాసనం వారిని రక్షిస్తుంది.

దాశరథి రంగాచార్య

నిత్యజీవితంలో బహుళజాతి సంస్థలు-1

- ఎన్. వేణుగోపాల్

"చక్రి సర్వోపగతుడెందెందు వెతికిన అందందే గలడు"- అని చెప్పి ప్రహ్లాదుడు నరసింహావతారాన్ని స్తంభంలోంచి రప్పించాడు. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యం అని అహంకరించిన బ్రిటిష్ పాలకవర్గాలు భూగోళం మొత్తంమీద తమ వలసలను స్థాపించి ఇరవైనాలుగు గంటలూ సూర్యుడు తమ పాలనలోనే ఉండేట్లు శాసించారు. అయినా నరసింహావతారం కథనాటికి తెలిసిన భూగోళం చాలా చిన్నది. బ్రిటిష్ వలసవాదానికి తెలిసిన భూగోళం పెద్దదే కానీ వలసలు విస్తరించిన భూభాగం ప్రపంచంలో మూడోవంతు మాత్రమే.

ఈ రెండు సామ్రాజ్యాలను తలదన్నేలా విశ్వవ్యాపితమైన, నిజంగా రవి అస్తమించని సామ్రాజ్యం బహుళజాతి సంస్థలది. ఇవాళ్టి ప్రపంచంలో బహుళజాతి సంస్థల ప్రమేయం లేని చోటు లేదు. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో బహుళజాతి సంస్థల సరుకులు వాడని మనుషులు లేరు. బహుళజాతి సంస్థలకు ముడిసరుకులు సమకూర్చి పెట్టని దేశమూ, ప్రాంతమూ లేవు. మన సొంత అనుభవంలోనే పరిశీలిస్తే మన నిత్యజీవితం బహుళజాతి సంస్థల సరుకులతో, బహుళజాతి సంస్థలు ప్రచారం చేసే సంస్కృతితో ఎంత ఎక్కువకాలం ముడిపడివున్నదో ఆలోచిస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఉదయం లేచీలేవగానే వాడుకునే టూత్‌బ్రష్, టూత్‌పేస్ట్‌ల దగ్గర ప్రారంభించి రాత్రి పడుకునే మంచాలు, పరుపులదాకా, రోజంతా చదివే పత్రికలు, చూసే ప్రకటనలు, టెలివిజన్ కార్యక్రమాలు, వినే రేడియో కార్యక్రమాలు, ప్రయాణించే వాహనాలు, ఇతరంగా వాడే విద్యుత్, టెలిఫోన్, బ్యాంక్, ఇన్సూరెన్స్, పరికరాలూ-సేవలూ అన్నీ కూడా ఏదోఒకరూపంలో బహుళజాతి సంస్థలతో సంబంధం కలిగినవే. ఆయా వస్తువులను, సేవలను అందించే దేశీయ పరిశ్రమలు లేకపోవడం ఒక ఎత్తైతే, ఉన్న పరిశ్రమలను కూడా నానాటికీ బహుళజాతి సంస్థలు తమ అధీనంలోకి తెచ్చుకోవడం మరో ఎత్తు. దేశంలో 1991 జూన్‌లో ప్రారంభం అయిన నూతన ఆర్థిక విధానాలు-ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ క్రమం దేశప్రజల జీవితాన్ని ఈ బహుళజాతి అధీనంలోకి మరింతగా నెట్టివేశాయి.

అసలు ఈ బహుళజాతి సంస్థలంటే ఏమిటి? వాటిని ఎందుకు వ్యతిరేకించాలి? అవి ఈ దేశంలోకి ప్రవేశించి చేయదల్చుకున్న పని ఏమిటి? ఎందువల్ల బహుళజాతి సంస్థల చొరబాటు, విస్తరణ ఈ దేశప్రజల ప్రయోజనాలకు హానికర మవుతాయి? ఈ ప్రశ్నలకు జవాబులు తెలుసుకోవాలంటే నాలుగు వందల సంవత్సరాల పెట్టుబడిదారీ విధానం చరిత్రను, పెట్టుబడిదారీ విధానం దాని అత్యున్నత దశలోకి ఎదిగి గత నూటయాభై సంవత్సరాలుగా సాగిస్తున్న సామ్రాజ్యవాద రాజకీయార్థిక విధానాలను అర్థం చేసుకోవాలి.

సామ్రాజ్యవాదం ఇవాళ బహుళజాతి సంస్థల రూపంలో వ్యక్తీకరణ పొందుతున్నది. భారతదేశంలో రాజకీయాధికారం నిర్వహించిన బ్రిటిష్ సామ్రాజ్యవాదం కన్నా, నిన్నమొన్నటి వరకూ వియత్నాంలో సైనిక, రాజకీయ ఆధిపత్యం చలాయించిన అమెరికన్ సామ్రాజ్యవాదం కన్నా-ఈ బహుళజాతి సంస్థల ఆర్థిక విస్తరణ కాంక్ష ప్రమాదకరమైనది. ఇది ప్రత్యేకంగా ఏ వలసనూ ఎంచుకోదు. కానీ అన్నిదేశాల రాజకీయార్థిక విధానాలను నిర్ణయించే అధికారం తనకే కావాలంటుంది. అమెరికన్ ప్రభుత్వాన్ని, పాలకవర్గాలను కూడా శాసించే ఈ బహుళజాతి సంస్థలదే ఇవాళ నిజమైన ప్రపంచాధిపత్యం. అమెరికన్ ప్రభుత్వ విదేశాంగనీతిని బహుళజాతి సంస్థలే నిర్ణయిస్తున్నా యనేది బహిరంగ రహస్యమే. విడివిడిగా ప్రపంచ ప్రజలు తమ దైనందిన జీవితంలో ఉపయోగించే వస్తువుల దగ్గరనుంచి అంతర్జాతీయ సంబంధాల దాకా సకల విషయాలనూ నిర్దేశిస్తున్న ఈ బహుళజాతి సంస్థలు ఎక్కడినుంచి పుట్టుకువచ్చాయి? ఎవరికి జవాబుదారీగా వుంటాయి? ఏ లక్ష్యాల కోసం పనిచేస్తాయి?

బహుళజాతి సంస్థలు (మల్టీ నేషనల్ కార్పోరేషన్స్) అని ఇవాళ మనం పిలుస్తున్న పారిశ్రామిక, వ్యాపార సంస్థలను జాతి అతీత సంస్థలు (ట్రాన్స్ నేషనల్ కార్పోరేషన్స్) అని కూడా పిలుస్తున్నారు. ఈ రెండు పేర్ల వెనక వున్న అర్థాలలో స్వల్ప భేదం ఉంది. ఆ భేదాన్ని తెలుసుకోవడానికన్నా ముందు అసలు బహుళజాతి సంస్థల పుట్టుక, పెరుగుదల గురించి ఆలోచించాలి.

బహుళజాతి సంస్థ అన్నమాట వినగానే ఆ సంస్థలో అనేక జాతుల భాగస్వామ్యం ఉంటుందనే అర్థం వస్తుంది. కానీ అది నిజం కాదు. పెట్టుబడిదారీ విధానం వ్యాపార పెట్టుబడి నుంచి పారిశ్రామిక పెట్టుబడి దశకు ఎదుగుతున్న సమయంలో ఒకదేశపు పారిశ్రామిక సంస్థలు అనేక దేశాల ముడిసరుకులను కొల్లగొట్టడానికి, ఆయా దేశాల మార్కెట్లలో తన సరుకులు అమ్ముకోవడానికి ఆ దేశాలలోనే తమ శాఖలు తెరవడం మొదలుపెట్టాయి. ఆ రకంగా పారిశ్రామిక వస్తువుల తయారీ ఒకే సంస్థకు సంబంధించినదైనప్పటికీ బహు

దేశాలకు విస్తరించింది. ఒక ఉదాహరణ చెప్పాలంటే అమెరికాకు చెందిన జనరల్ మోటార్స్ అనే సంస్థ తయారుచేసే కార్లలో విడిభాగాలు దక్షిణ కొరియా, జపాన్, జర్మనీ, తైవాన్, బ్రిటన్, ఐర్లండ్ వంటి ఎన్నో దేశాలనుంచి వస్తాయి.

ఈ దశ దాటి పెట్టుబడిదారీ విధానం ఒక అడుగు ముందుకువేసి ద్రవ్య పెట్టుబడిదశకు చేరుకున్నప్పుడు పారిశ్రామిక ఉత్పత్తి వివిధ దేశాలలో జరిగినా, జరగకపోయినా– ద్రవ్య పెట్టుబడి అన్నిదేశాల నుంచి అన్ని దేశాలకూ విస్తరించింది. అంటే ఒక సంపన్నదేశపు పెట్టుబడిదారీ వర్గం ఒక పేదదేశంలో స్వయంగా పరిశ్రమలు నెలకొల్పకుండానే ఉన్న సంస్థలలో మదుపుపెట్టి ఆ సంస్థలను శాసించగలుగుతుంది.

ఇవాళ్టి ప్రపంచంలో ఈ రెండురకాల విధానాలు అమలులో వున్నాయి. స్థానికంగా తమ ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పడం, ఉన్న ఉత్పత్తి కేంద్రాలను కొనివేయడం దేశీయ సంస్థల వాటాలను షేర్ మార్కెట్లో కొని వాటిలో నిర్ణయాధికారాన్ని సొంతం చేసుకోవడం మొదలైన పనులకు బహుళజాతి సంస్థలు పూనుకుంటున్నాయి. అంటే పెట్టుబడి, యాజమాన్యం సంపన్నదేశాల పెట్టుబడిదారుల చేతులలో ఉండి ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి కేంద్రాలు, మార్కెట్ విస్తరించిన సంస్థలు అన్నింటినీ బహుళజాతి సంస్థలు అని పిలవవచ్చు.

ఇటువంటి సంస్థలు ప్రపంచవ్యాప్తంగా 40,000 ఉంటాయని ఒక అంచనా. వీటికి వేరువేరు దేశాలలో భాగస్వామ్య సంస్థలూ, శాఖలూ మూడులక్షలదాకా ఉన్నాయి. ఇవి ఎంత పెద్దవి అంటే ఫోర్డ్, జనరల్ మోటార్స్ అనే రెండు అమెరికన్ బహుళజాతి వాహన ఉత్పత్తి సంస్థల అమ్మకాలు సహారా ఎడారిలో ఉన్న 12 దేశాల స్థూల జాతీయోత్పత్తి కన్నా ఎక్కువ. ఆరు జపనీస్ బహుళజాతి సంస్థల వార్షిక ఆదాయం మొత్తం లాటిన్ అమెరికా ఖండంలోని దేశాల జాతీయ ఆదాయం కన్నా ఎక్కువ.

భారతదేశంలో దాదాపు 150 బహుళజాతి సంస్థల శాఖలో, భాగస్వామ్య సంస్థలో ఉన్నాయని ఒక అంచనా. ఈ బహుళజాతి సంస్థల వార్షిక ఆదాయం భారత జాతీయ ఆదాయం కన్నా 20 రెట్లు ఎక్కువ.

ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలతో పోల్చిచూసినపుడు బహుళజాతి సంస్థలు ఇంత బలోపేతమయినవి కనుక ఆయా దేశాల ప్రభుత్వాలకు, బహుళజాతి సంస్థలకూ మధ్య సంబంధం సమానంగా ఉండడం సాధ్యం కాదు. బహుళజాతి సంస్థలు ప్రవేశించినపుడు కేవలం ఆ దేశంలోని ఖనిజ వనరులను, ముడిసరుకులను తీసుకుపోవడానికి, ఆ మార్కెట్లలో తమ సరుకులు అమ్ముకోవడానికి అంటే కేవలం వ్యాపార ప్రయోజనాల కోసమే ప్రవేశించవచ్చు. కానీ తమ బలం వల్ల, సంపద నుంచి వచ్చే అహంకారం వల్ల ఆ ప్రభుత్వాలను లొంగదీయడం ప్రారంభిస్తాయి. తమకు ముడిసరుకులు అందడానికి ఉన్న ఆటంకాలన్నింటినీ తొలగించమని ఆదేశిస్తాయి. తమ మార్కెట్లు విస్తరించుకోవడానికి ఇతోధిక అవకాశాలు కల్పించమని ఆదేశిస్తాయి. ఒక్కమాటలో చెప్పాలంటే స్థానిక ప్రభుత్వపు రాజకీయార్థిక విధానాలను తామే నిర్దేశిస్తాయి.

ప్రపంచీకరణ, సరళీకరణ అనే పదాలకు స్థూలమైన అర్థం ఇదే! పేదదేశాలు తమ ముడిసరుకులను, తమ మార్కెట్లను ప్రపంచీకరించాలి. ఆ ప్రపంచీకరణకు ఆటంకాలుగా ఉన్న స్థానిక పరిరక్షణ చట్టాలను, ఆంక్షలను, ఆచారాలను సరళీకరించాలి.

ఈ పని జరిగిన తరువాత మార్కెట్లలోకి బహుళజాతి సంస్థల సరుకులు ఇబ్బడి ముబ్బడిగా దిగుమతి అవుతాయి. అవసరం ఉన్నా లేకపోయినా సరుకులను వాడే వినియోగదారీ సంస్కృతి వ్యాపిస్తుంది. ప్రకటనలతో, ప్రోత్సాహకాలతో, ఆకర్షణలతో, బెదిరింపులతో కొత్త సరుకులను మప్పడం మొదలవుతుంది. ఒక దశాబ్దం వెనకకూ ఇప్పటికీ మన వ్యక్తిగత జీవితంలోకి ఎన్ని కొత్త సరుకులు ప్రవేశించాయో, వాటిలో నిజంగా అవసరం కొద్దీ వచ్చినవెన్నో, అవసరం లేకపోయినా ప్రచార ఆర్భాటం వలన, సామాజిక కార్యక్రమాల వలన వచ్చినవెన్నో సమీక్షించుకుంటే సరుకు జీవితంలోకి ఎంత చొచ్చుకువచ్చిందో అర్థం అవుతుంది. ఈ చొచ్చుకువచ్చిన సరుకుల్లో 90 శాతం పైన బహుళజాతి సంస్థల ఉత్పత్తులే.

ఈ బహుళజాతి సంస్థల ఉత్పత్తుల వినియోగానికి ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక కోణాలెన్నో ఉన్నాయి. ఆ సరుకులు మన ఉపయోగం కోసమో, మన సౌకర్యం కోసమో, విలాసం కోసమో వచ్చినట్లు పైకి కనపడవచ్చు కానీ వాస్తవంగా వాటి వినియోగం వలన మనం పొందే ప్రయోజనం కన్నా మనం వాటిని వినియోగించటం వలన బహుళజాతి సంస్థలు పొందే ప్రయోజనం ఎక్కువ.

మనం నిత్యజీవితంలో వాడుతున్న వస్తువులను ఒకటొకటిగా తీసుకుని వాటిని, వాటివెనుక రాజకీయార్థిక ప్రయోజనాలను వివరించడం ఈ శీర్షిక లక్ష్యం. వరుసగా ఆయా సరుకులను వాటి మార్కెట్లను వాటి ఉత్పత్తిదారులను వివరించి వాటికి ప్రత్యామ్నాయాలను సూచించడం జరుగుతుంది. బహుళజాతి సంస్థలమీద పోరాటం స్థూలస్థాయిలో కూడా అంతగానే జరగవలసి ఉందనే గుర్తింపును కలిగించడం కోసమే ఈ వ్యాస పరంపర. ○

105 బిలియన్ డాలర్లకు పెరిగిన రుణభారం

దేశంలో సంస్కరణలు ప్రవేశపెట్టిననాటికి 91 బిలియన్ డాలర్లుగా వున్న రుణభారం 2001-02 నాటికి 105 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఏదో ఉడతాభక్తిగా మన ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా రాష్ట్ర రుణభారాన్ని 15 వేలకోట్ల నుంచి ఈ సంవత్సరం ఆఖరుకు 57 వేలకోట్లకు పెంచబోతున్నారు. ఇలా రుణాల ఊబిలో దిగబడిపోతున్న విషయాన్నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికా అన్నట్లు కేంద్రం 1.6 బిలియన్ డాలర్ల రుణాన్ని గడువుకాలం ముందే చెల్లించబోతున్నట్లు (ఇంతకుముందు మూడు బిలియన్ల రుణాన్ని తిరిగి చెల్లించింది) వార్త. 105 బిలియన్ డాలర్లలో నాలుగు బిలియన్ డాలర్లు తిరిగి చెల్లింపు సముద్రంలో కాకిరెట్ట. రుణభారం పెరుగుదల చూస్తే ప్రతి సంవత్సరం సగటున ఒక బిలియన్ డాలర్లకు పైగానే పెరుగుతూ వస్తుంది. ఇదే ధోరణి కొనసాగితే అసలే అస్తుబిస్తుగా వున్న ఆర్థికస్థితి మరింత బిగుసుకుంటుంది. చెల్లించాల్సిన వడ్డీలో పెద్ద మార్పేమీ వుండదు. ఇలా తిరిగి చెల్లించటం ప్రపంచ బ్యాంకుకు, ఐ.ఎం.ఎఫ్.కు ఎంతమాత్రం ఇష్టంలేకపోవడమే కాదు, లాంఛనంగా తమ అసమ్మతిని తెలియచేశాయి కూడా. గడువుకు ముందే చెల్లింపులు చేసే డ్రామా కొత్తదేమీకాదు. శ్రీమతి ఇందిరాగాంధీ 80వ దశకంలో అధికారంలోకి తిరిగి వచ్చిన తరువాత ఐ.ఎం.ఎఫ్. నుంచి రుణం తీసుకొని, తర్వాత అందులో కొంతభాగం రుణాన్ని తీసుకోబోవటం లేదని ప్రకటించింది. అయినా రుణభారం తగ్గకపోగా 1991 నాటికి 91 బిలియన్ డాలర్లకు పెరిగింది. రుణాలివ్వటం, ఆ పేరుతో ఆయాదేశాల ప్రభుత్వాలమీత ఉడుంపట్టు సాధించడం ప్రపంచబ్యాంకు చేసే వ్యాపారం. అప్పుచేసి బండిని లాగించటం బిజెపి ప్రభుత్వం విధానం. మధ్యన వడ్డీభారాలు మోయలేక చచ్చేది మనం.

* * *

సంస్కరణలు ప్రవేశపెట్టిన తరువాత బహుళజాతి సంస్థలు బుడబుడా వచ్చి భారతీయ మార్కెట్‌పై వ్రాలాయి. 30 కోట్ల మధ్యతరగతి మార్కెట్ వుందని లెక్కలు వేసుకొని, ఆ మార్కెట్‌ను తమ బుట్టలో వేసుకుందామని వస్తే, వాళ్ళ అంచనాలు తలక్రిందు లయ్యాయి. అమెరికాలో లాగ కొత్త మోడల్ వినిమయ విలాసవస్తువు మార్కెట్‌లోకి వస్తే పాతదానిని చెత్తకుప్పమీదకు విసిరేయగలిగే మధ్యతరగతి మార్కెట్ కాదని గ్రహించారు. వారి దృష్టిని గ్రామీణ, చిన్న పట్టణాలవైపు మరల్చారు. అక్కడ కూడా మార్కెట్ పెద్దదే. 2001 జనాభా లెక్కల ప్రకారం 60 శాతం కుటుంబాలకు రేడియో, ట్రాన్సిస్టర్, టెలివిజన్, టెలిఫోన్, సైకిలు, స్కూటరు, మోపెడ్, కారు, జీపులాంటి ఎటువంటి సౌకర్యం లేనివారే. ఉదాహరణకు గ్రామాల్లో స్కూటర్లు, మోటారు సైకిళ్ళు తామరపంపరగా పెరిగాయనే భావన మనకుంది. అది బహుశా మనరాష్ట్రంలో కొంతవరకు నిజమే కావచ్చు. కాని దేశం మొత్తంమీద చూసుకుంటే గ్రామీణ ప్రాంతంలో 6.7 శాతం కుటుంబాలకే ఈ ద్విచక్ర వాహనాలున్నాయి. అంటే ఇంత మార్కెట్ బహుళజాతి సంస్థల కళ్ళముందు ధగధగా మెరుస్తూ ఆకర్షిస్తూంది. కాని కొనుగోలుశక్తి ఏది?

దేశంలో నదుల అనుసంధానం అనే ఆలోచనకు ఇటీవల ప్రాణంపోసిన చంద్రబాబు, పక్కనేవున్న కర్నాటకతో నీటిసమస్య పరిష్కారం చేసుకోలేకపోయారు. అలాంటిది ఎన్నో భారీనదుల్లో జలాలు రాష్ట్రాల సరిహద్దులను దాటి మరేవో ఇతర రాష్ట్రాలకు పోతుంటే, ఆ ప్రాంతవాసులు ఊరుకుంటారా? నీటియుద్ధాలే జరుగుతాయి. అలాంటి యుద్ధాలకు చంద్రబాబు పునాదిరాయి వేస్తే, ఇదేదో వాటంగా వుందని కేంద్రం ఒక జాతీయ నీటి అభివృద్ధి ఏజెన్సీనే ఏర్పాటుచేసి దానికి కథానాయకునిగా సురేష్‌ప్రభును నియమించింది. ఈ ఆలోచనను ప్రచారంలో పెట్టమని ఆదేశించింది. బిజెపి యువత పిలిస్తే ఆయన హైదరాబాద్ వచ్చి ఓ గంట ఉపన్యాసం ఇచ్చారు. అంతవరకూ బాగానే వుంది. అది దేశానికి, రాష్ట్రాలకు ఎంత లాభదాయకమైనదో చక్కగానే చెప్పారు. కాని దానికి కావాల్సిన నిధుల దగ్గరకు వచ్చేసరికి మాటలు తడబడినాయి. సర్వ ప్రయత్నాలు చేస్తున్నామని దాటేశారు. ఇలా దాటేసే కళను ఆయన బహుశా చంద్రబాబు వద్ద నేర్చుకునివుంటారు. విజన్ 2020 రూపకల్పనచేసి, దానికి కావాల్సిన నిధుల విషయం వచ్చేసరికి ఆ విజన్‌లో ఏమీలేదు. ఏవో గాలిమాటలు మాట్లాడారు. అలాగే మొన్ననే తిరుపతిలో పథకాల పట్టీనొకదాన్ని జనంమీద వదిలిపెట్టి, నిధుల విషయం వచ్చేసరికి నోటిమాట రాలేదు. సురేష్‌ప్రభు కూడా ఆ కోవలో చేరారు. ప్రణాళికలు తయారుచేస్తారట. "నిధుల లభ్యతను బట్టి ఆచరణ వుంటుంది" అని చావుకబురు చల్లగా చెప్పారు. అలాగే ఇలా నదీజలాలను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించేటప్పుడు వచ్చే కొట్లాటలను గురించి ఆయన ఉపన్యాసంలో ఒక్క అక్షరమ్ముక్క లేదు. తన ఊళ్ళో, తన చెరువులో, తన బావిలో తాగడానికి నీళ్ళచుక్క లేదుకాని నదుల సంధానం చేసి నీరు తీసుకొనివస్తారట. నిజమే కొన్ని రాష్ట్రాల్లో మిగులు జలాలున్నాయి. కొన్నిచోట్ల నీటికరువు వుంది. అనుసంధానం చేస్తే నీరు లభిస్తుంది. కాని భూమ్మీద నిలబడి ఆలోచించే పని లేదా? గడ్డిపరక ఆధారంగా సముద్రాన్ని ఈదటం అంటే ఇదే. ○

సామ్రాజ్యవాదానికి శల్యపరీక్షే ఈ 'యుద్ధ నేరస్థులు బుష్-బ్లెయిర్'

(వ్యాస సంకలనం)

ఆఫ్ఘనిస్తాన్ వంతయ్యాక, సామ్రాజ్యవాదం ఇరాక్‌పై పంజా విసిరింది. ఇందుకు మానవ విధ్వంసక జీవరసాయన ఆయుధాలు వున్నాయన్నది ఓ నెపం. ఐక్యరాజ్యసమితి బృందం సుదీర్ఘ పరిశీలన చేసి ఆయాతరహా ఆయుధాల జాడలేదని ప్రకటించింది. దీంతో సామ్రాజ్యవాద ఎత్తుగడ ప్రపంచ ప్రజలముందు తేటతెల్లమై పోయింది. మరీ నాటకమంతా ఏకధృవ ప్రపంచ లక్ష్యదిశగా అమెరికా తన అధికార సుస్థిరత కోసం, ఆ క్రమంలోనే విస్తరించుకు నేందుకేనని ప్రపంచదేశాలు గుర్తెరిగాయి. పైకి కన్పిస్తున్న విషయాలు యివే అయినా, ఈ విషయాల వాస్తవాల వెనుకనున్న అనేక అత్యంత కీలక అంశాలను, ఎత్తుగడలను ప్రముఖ సంపాదకులు ఎ.బి.కె. పాఠకులకు అందించారు. యీ సంకలనం సామ్రాజ్యవాద దురాక్రమణ స్వభావాన్ని తేటతెల్లంగా పాఠకుల ముందుంచుతుంది. ఈ సామ్రాజ్యవాద బూచిని గుడ్డిగా నమ్ముతున్న దేశాల భవిష్యత్తు ఏం కానుందో తెలియజేసేందుకై 'దిక్సూచి'లా ఎ.బి.కె. విశ్లేషణ పాఠకులకు దోహదపడుతుంది. తద్వారా యిందుకు తోకాడిస్తున్న జాతీయ, రాష్ట్రీయ పాలకవర్గాలను అవగతం చేసుకోవడానికి మార్గాన్ని సుగమం చేస్తుందీ విశ్లేషణ.

సద్దాం దుష్టపాలన నుండి ఇరాక్ ప్రజలను విముక్తిచేసే లక్ష్యం కోసమే ఇరాక్‌పై యుద్ధమని బుష్ ప్రకటించగా, రెండో పెద్ద పెట్రోలియం నిల్వలు వున్నందున ఇరాక్‌పై ఈ దాడని చెప్తూ, ఇరాక్‌పై అమెరికా విధించిన ఆర్థిక ఆయుధ ఆంక్షలు పనిచేయ నందున అక్కసుతో కక్కుతున్న విషమని ఈ విశ్లేషణ స్పష్టం చేస్తుంది. ఈ నేపథ్యంలో మొదటి ప్రపంచయుద్ధం తర్వాత నానా జాతి సమితి ఉనికిని కోల్పోయిన వైనాన్ని తడుముతూ మొత్తం చరిత్రనే పాఠకుల ముందుంచే ప్రయత్నమూ ఉంది.

ఇరాక్‌పై తమదాడిని బలపర్చుకునేందుకై బుష్ చేస్తున్న వ్యాఖ్యానాలన్నింటి అంతరార్థాలను విశ్లేషించి బుష్‌నో అబద్ధాల పుట్టగా పాఠకుల న్యాయస్థానంలో నిలబెడతారు. ఐక్యరాజ్యసమితి అనుమతితోనే ఈ దాడి అని చెప్పుకోచూసిన బుష్ ఎలా అవమాన పడిందీ చివరకు ఎలా బరితెగించి ఏకపక్ష యుద్ధాన్ని ప్రకటించిందీ పాఠకుల ముందుంచారు. గత 200 ఏళ్ళలో ఎన్నెన్ని సార్లు యితర దేశాల విషయాల్లో జోక్యం చేసుకుందీ, ప్రపంచ న్యాయస్థానాన్ని ధిక్కరించిందీ చెప్తూ అమెరికా సైనికుడు కార్పొరల్ వైఫ్రీ పాటర్సన్ చేసిన ప్రకటనను 'కోట్' చేయడం ముదావహం, ఉపయుక్తం కూడా.

ఆయుధశక్తి ప్రజల ఆశయశక్తిముందు తలవంచాల్సిందే నంటూ, "రుమాయిలా ఆయిల్ కోసమే బుష్ రుబాబు" అన్న సంపాదకీయంలో వివరించారు ఎ.బి.కె. ఇరాక్‌పై అమెరికా దురాక్రమణకు ప్రధాన లక్ష్యం ఇరాక్ పెట్రోలియం నిధులపై ఆధిపత్యం సంపాదించడమే నంటూ, అందుకై అమెరికా పన్నిన వ్యూహాన్ని సోదాహరణంగా వివరిస్తారు. అలాగే పాలస్తీనాను యూదు జాతీయులకు కట్టబెట్టే రహస్యాన్ని, ఇరాక్-కువైట్‌ల శతృత్వ నేపథ్యాన్ని, బ్రిటిష్‌వాడి దౌత్యాన్ని విడమర్చారు. అలాగే 50 మైళ్ళ రుమాయిలా ఆయిల్ క్షేత్రాల్లో కేవలం రెండు మైళ్ళమేరకే కువైట్ అనుభవించేందుకు అర్హురాలనీ, మిగతా 48 మైళ్ళు ఇరాక్ ఆధీనంలో వున్నందున వీటిని స్వాధీనం చేసుకోవడమే బుష్-బ్లెయిర్‌ల లక్ష్యమని రుజువు చేస్తారు. ఈ ఆయిల్ క్షేత్రాల వల్ల వీరు పొందనున్న ఆర్థిక లాభాన్నీ-అదేవరుసలో పెట్రోలు ధరల నియంత్రణకై సద్దాం కృషినీ వివరిస్తారు. ఈ సారూప్య వివరణ దొరెవరో? దొంగెవరో? పాఠకులకు యిట్టే చెప్పేస్తుంది.

సామ్రాజ్యవాదులు నానాజాతి సమితిని భ్రష్టుపట్టించిన క్రమం లోనే 50 ఏళ్ళ ఐక్యరాజ్య సమితనీ భ్రష్టు పట్టించనున్నారని ఓ హెచ్చరిక చేస్తారు. ఏ సమున్నత లక్ష్యాల కోసం ఏర్పడిందీ చెప్తూ, ఒక రాజ్యం చేతిలో ఎలా కీలుబొమ్మయిందీ- సోదాహరణంగా వివరించారు. యిదే క్రమంలో జూనియర్ బుష్ అధికారంలోకి వచ్చిన వైనం, సెప్టెంబర్ 11 నాటి ఘటన పుణ్యాన ఆయన పదవికి 'భద్రత' లభించిన వైనమూ ఉంది. అలాగే అమెరికా మాజీ యుద్ధవీరులు ఇరాక్‌ను బలపర్చిన వాస్తవాన్ని చెప్తూ, వియత్నాం యుద్ధం నాటి దుర్మార్గంతో వారెలా మానసికంగా వికలమైపోయిందీ వివరిస్తూ, యుద్ధ 'వికృతాన్ని' ఆవిష్కరించారు. సగటు పాఠకుని అనుభవంలోకి తీసుకువస్తారు. చట్టబద్ధమైన నేత లేని దుర్భలత్వంతో వుంటూ, దేశాన్ని ఎలా నడిపించుకోవాలో ఇరాక్‌కు ఏమని సుద్దులు చెప్పగలమని, అమెరికాను ప్రజల పక్షాన ప్రశ్నిస్తారు. తొలి గల్ఫ్ యుద్ధం నాటి సీనియర్ బుష్ దౌష్ట్యాన్ని గుర్తుచేస్తూ, అదేకోవలో జూనియర్ బుష్ వ్యవహరిస్తున్నాడని సామ్రాజ్యవాద మౌలిక నైజాన్ని సూత్రీకరించారు. దీని కొనసాగింపు గానే సామ్రాజ్యవాదం వలస దేశాల ప్రజల సమరదీక్ష ముందు ఎలా ముడుచుకోవాల్సి వచ్చిందీ చెప్పి, తగు ఆత్మస్థైర్యాన్ని అందిస్తారు పాఠకులకీ, మూడో ప్రపంచ ప్రజలకీ.

నిర్గుణ, నిరాకార టెర్రరిజం పేరిట, దుర్గుణ, దురహంకార పూరిత దుర్మార్గపు అమెరికన్ సామ్రాజ్యవాదం సాగుతున్నదని- అశేష ప్రజానీకమూ ముక్తకంఠంతో నిరసిస్తున్నారనీ స్పష్టం చేస్తారు. ఈ నిరసనలే శాంతిని పెంచి, సమరశీల శక్తిని, జాగరూకతను మానవాళిలో నింపి దురాక్రమణకు అడ్డుకట్ట వేయాలనే ఆశాభావాన్నీ వ్యక్తం చేస్తారు. తద్వారా పాఠకులను ఆలోచింపచేస్తారు.

"నివురుగప్పిన నిప్పుల మధ్య సమరభేరీలు" అన్న సంపాదకీయంలో సద్దాంని మట్టుబెట్టటం పేరిట చమురుబావుల స్వాధీనమే అమెరికా లక్ష్యమంటూ వక్కాణిస్తారు. ఇరాక్‌లో ఎదురౌతున్న ప్రతికూల పరిస్థితులు, అమెరికా బ్రిటన్ దళాలను తత్తరపాటుకు గురిచేస్తున్నాయంటూ ఈ సందర్భంలలో బిన్ లాడెన్‌ను పట్టుకోలేని సామ్రాజ్యవాద అశక్తతకు ఓ చురకేసి, కనీసం సద్దాంని పట్టుకున్నా, కోల్పోయిన పరువైనా దక్కివుండేదని ఎద్దేవా చేస్తారు. అలా కానందునే ఉక్రోషంతో 'సామ్రాజ్యవాదం' బాగ్దాద్‌లోని భారీ నిర్మాణాలను కూల్చేస్తుందని వారి అశక్తతను వ్యక్తం చేస్తారు. ఇలా సామ్రాజ్యవాద దౌష్ట్యాన్ని చెప్తూనే వెనువెంటనే 'పునర్నిర్మాణం' పేరిట మల్టీ నేషనల్స్‌కు కాంట్రాక్టులనిచ్చే భవిష్యత్ కుట్ర లక్ష్యాన్నీ మనకందిస్తారు. పదాతిదళాలతో ఎదురుపడలేకనే విమానదాడులకు పాల్పడుతూనే, ఇరాకీ సైనికుల లొంగుబాటుకు కరపత్ర పంపిణీ సామ్రాజ్యవాద యుద్ధనీతని తేల్చిచెప్పారు. దీన్ని బలర్చుకోడానికే పొంతనలేని ప్రకటనలకూ పాల్పడతారు నేతలు. ఏది ఏమైనా మారణాస్త్రాల పేరిట ఇరాక్‌ను నిరాయుధం చేయడం ద్వారా, తన ఆయుధీకరణతో ఇరాక్ ఆయిల్ సంపదను దోపిడీచేయడానికి మార్గాన్ని సుగమం చేసుకోవడమే అమెరికాలక్ష్యమని సూత్రీకరిస్తారు. ఏఏ సందర్భాల్లో మారణాస్త్రాలను అమెరికా వినియోగించిందీ, ఎంతెంత నష్టాన్ని కలుగజేసిందీ పాఠకునికి చెప్పి, అమెరికా కపటత్వాన్ని తేల్చిచెప్తారు ఎ.బి.కె.

అలాగే, 'గల్ఫ్‌నుంచి ఇరాక్‌ను తుడిచిపెట్టే పన్నాగం' పేరిట రాసిన సంపాదకీయంలో సద్దాం ఎత్తుగడల ముందు దురాక్రమణ కూటమి దాడులు ఎంతటి తత్తరబాటుతో సాగుతున్నవీ సోదాహరణంగా వివరిస్తారు. అమెరికన్ సైనికుల యుద్ధ విముఖతను అభినందిస్తూ పాటర్సన్ ఆదర్శాన్ని, సుసాంప్రదాయాన్నీ 'గుర్తు' చేసుకునేలా చేస్తారు. మొదటి గల్ఫ్‌యుద్ధం దుష్ట మిత్రమండలి-నేటి రెండ్ గల్ఫ్‌యుద్ధం నాటికి చితికిపోయిందంటూ...పాలుపోని పరిస్థితుల్లో ఉత్తర ఇరాక్‌ను టర్కీ అండతో చీలగొట్టి బఫర్‌ను సరికొత్త మధ్యస్థ మండలంలా సృష్టించి తన ఆధిపత్యంలోకి తెచ్చుకునే దుష్టయత్నంలో అమెరికా వుందనే ఎత్తుగడను బయటపెడతారు. ఒక్కమాటలో పర్షియన్ గల్ఫ్ పటంనుంచి ఇరాక్‌ను తుడిచిపెట్టేయటమే సామ్ర్యాజ్యవాద కాంక్షగా చెప్తూ, అది 'అసాధ్యం' అనే భరోసాతో ఆత్మస్థైర్యాన్నిచ్చిట్టయింది. యిన్నివిధాలైన సామ్రాజ్యవాద యుద్ధ తంత్రాన్ని, కుతంత్రాల్నీ కళ్ళకు కట్టినట్టు చెప్పగలగటం చాలా క్లిష్టమైంది. అయినా దాన్ని సుసాధ్యం చేశారు ఎ.బి.కె.

దుష్టపూరిత సామ్రాజ్యవాద నైజాన్ని పటిష్టంగా చెప్పేందుకై యుద్ధఖైదీల విషయంలో పాటించవలసిన కనీస నీతినియమాలను రూపొందించిన "జెనీవా కన్వెన్షన్"ను గుర్తుచేస్తారు ఎ.బి.కె. ఈ సందర్భంగా.

తన వాదనలను బలపర్చుకునేందుకు అవసరమైన కారణాలన్నింటినీ కేంద్రీకృతం చేసి చారిత్రక ఘటనలను ఉటంకించి బలపర్చుకోవడం ఎ.బి.కె. గొప్పతనం. దీంతో పాఠకుడికి సంబంధిత అంశం యొక్క పూర్వాపరాలను సమగ్రంగా సందర్శించే వెసులుబాటూ కలుగుతుంది. ఇక్కడ 'జెనీవా కన్వెన్షన్'ను ప్రస్తావించి 1984 నాటి సమితి జనరల్ అసెంబ్లీ తీర్మానాన్ని గుర్తుచేస్తూనే అమెరికా ఇజ్రాయెల్‌లు మాత్రమే వ్యతిరేకించా యంటారు. విదేశీయుల్ని హత్యచేయడాన్ని నిషేధించిన చట్టాన్ని 1976లో అమెరికా సవరించిందంటూ, అలెండి, లుముంబా నేతల హత్యావివరాలను చెప్పి సామ్రాజ్యవాద దుర్మార్గాన్ని మరింత స్పష్టంగా చెప్పిగలిగారు ఎ.బి.కె.

యిన్ని దుర్మార్గాలకు పాల్పడుతూనే, ఇరాక్ అమెరికా సైనికుల్ని యుద్ధ ఖైదీలుగా ప్రకటించడం జెనీవా కన్వెన్షన్‌కు విరుద్ధమని అమెరికా ప్రశ్నిస్తే, తానతిక్రమిస్తే తప్పుకాదని ఎదుటివాడు అతిక్రమిస్తే తప్పా? అని అమెరికాను తప్పుపడతారు. ఏ భద్రతా మండలి సాధికార నిర్ణయం ఆధారంగా ఈ దాడికి పాల్పడ్డారని ఈ సందర్భంగా అమెరికాను నిలదీయడం సందర్భోచితంగా వుంది.

కాశ్మీర్ సమస్యపై మనదేశ వైఖరిని, సెక్యులర్ శక్తిగా నిశ్చల విధానాన్ని అనుసరించిన ఇరాక్‌పై, ఆంగ్లో-అమెరికన్ పాలకులు జరుపుతున్న దురాక్రమణను ఖండించలేని బి.జె.పి. సంకీర్ణ ప్రభుత్వ నిస్సహాయతను ఎ.బి.కె. తీవ్రంగా ఎండగట్టారు. 'నూరుకోట్ల భారత పౌరులు గొంతు విప్పాలి' అన్న సంపాదకీయంలో అలీనోద్యమానికి నేతగా మనదేశం వ్యవహరించిన వైనం పలు సందర్భాల్లో అమెరికా వైనాన్ని ఎండగట్టిన ఘటనలనూ మనముందుంచి అలీనోద్యమ లక్ష్యాన్ని సూచించడం జరిగింది. బి.జె.పి. సంకీర్ణం వందకోట్ల భారతీయుల సామ్రాజ్యవాద వ్యతిరేక సంప్రదాయాలకు భిన్నమైన దారిపట్టాయని సోదాహరణంగా వివరిస్తూ, పరివార్ ప్రభుత్వ వైదేశిక విధానం-ఈ నాన్పుడు వ్యవహారానికి భిన్నంగా నూరుకోట్ల భారతప్రజలూ గొంతువిప్పాలనే లక్ష్యసూచనా వుంది.

అమెరికా సామ్రాజ్యవాదం మూడో ప్రపంచ ప్రజలతోపాటు తనదేశ ప్రజల భద్రతాయుత జీవనాన్ని సైతం దురహంకార దాడికి బలిచేయపూనుకుందనే విశ్లేషణా బాగుంది. ఇరాక్‌లో మారణ హోమానికి సుమారు మూడులక్షల ఎనభైవేల కోట్ల రూపాయల మేరకు వ్యయం చేయనున్నట్టు బుష్ అమెరికాలో పేర్కొన్నాడంటారు. దినదినం దిగజారుతున్న అమెరికా జీవనస్థాయి నేపథ్యంలో యింత భారీ వ్యయానికి పాల్పడటం..., తగిన భద్రమైన పునాదుల్ని ఏర్పరచుకోలేదని హార్వల్ బ్రార్ అనే సామాజిక శాస్త్రవేత్త మాటల్లో హెచ్చరిస్తారు. ఈ క్రమంలోనే వియత్నాం యుద్ధంలో అమెరికా రక్షణశాఖ తయారు చేసిన రహస్య డాక్యుమెంటూ- ఎల్స్‌బర్గ్ అనే సైనికుడు దాన్ని

వెల్లడించిన వైనాన్ని పాఠకులకు అందిస్తారు. దీంతో యింతచేసినా తాము పాల్పడిన దురహంకార దాడిలో ప్రతికూల పరిస్థితులెదురయ్యే సరికి బుష్-బ్లెయిర్‌లు తప్పుడు ప్రచారానికి తెరతీయక తప్పలేదనే అభిప్రాయం పాఠకులకు కలుగుతుంది.

అల్-జజీరా టెలివిజన్‌లో ఇరాకీ సైనికులకు ఆంగ్లో- అమెరికన్ యుద్ధఖైదీలు పట్టుబడిన వైనమూ-వివరాలు ప్రసార మయ్యాక, అమెరికా బ్రిటిష్ పాలకులు యుద్ధవార్తల సెన్సార్‌షిప్‌నే కాదు పలు ఛానళ్ళను స్తంభింపచేశారు. అనుమతించిన ఛానళ్ళ ద్వారా అనుకూల వార్తలను ప్రసారం చెయ్యడమే కాకుండా, యుద్ధ వార్తలను-ఫోటోలను ప్రపంచీకరణ బాటున సొమ్ముచేసుకునే వాస్తవ కుట్ర దాగి వుందంటారు. యింతటితో ఊరుకోకుండా 1978-79లో ఐక్యరాజ్య సమితి విద్య, సాంఘిక, సాంస్కృతిక సంస్థ చేసిన తీర్మానాన్ని అమెరికా ఎలా ఉల్లంఘించిందీ చెప్పే వైనం బావుంది. యిందుకనువుగా ఎలక్ట్రానిక్ మీడియాపై ప్రభుత్వ కంట్రోల్‌ను తప్పించి 'ప్రైవేటీకరణను ప్రోత్సహించాలని యునెస్కో మెడలు వంచిన వివరణ వాస్తవాలనూ మనముందుంచుతారు.

యిందుకు కొనసాగింపుగానే 'మీడియాపై ఆంక్షలు-యుద్ధ రంగం సాక్ష్యాలు' అన్న సంపాదకీయంలో యుద్ధ వాస్తవ పరిస్థితులను తెలిపే వార్తలు బయటకు రాకుండా, ప్రపంచ సమాచార వ్యవస్థను, వెబ్‌సైట్లనూ బుష్-బ్లెయిర్‌లు శాసించారనీ, యింత శాసించినా 'నిప్పును గుడ్డ దాచిపెట్టదన్నట్టుగా' అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రతినిధి విన్సెంట్ బ్రూక్ ద్వారా వాస్తవాలు వెల్లడైన వైనాన్ని విడమర్చడం బావుంది. 1999 నుండి డాలర్‌ని ఎదిరించగల స్థాయిలో 'యూరో' కరెన్సీ ఎదుగుతూ వచ్చిందనీ, గల్ఫ్‌దేశాలు 'యూరో' వైపుకు మొగ్గుచూపసాగాయనీ చెప్తారు. ఇరాన్‌తో సహా అమెరికాకు విమాన స్థావరాలిచ్చి గల్ఫ్ ఆయిల్‌ని దోచుకోవడానికి సైతం అవకాశం కల్పించిన సౌదీ అరేబియా సైతం ఆయిల్ వాణిజ్యాన్ని డాలర్ నుంచి యూరోలోకి మార్చాలని లోపాయికారిగా పట్టుపట్టడం కూడా ఈ దుష్టకూటమి దాడికి కారణంగా విశ్లేషిస్తారు ఎ.బి.కె. మరో కోణంలో.

అలాగే 'ప్రచార యుద్ధంలో వాస్తవ వార్తలెలా బలిగొంటాయో' సోదాహరణంగా వివరించారు. ఈ గోబెల్స్ ప్రచార పునాదిని తడుముతూ, అబద్ధాల వంటకం ద్వారా దుష్టకూటమి యుద్ధరంగం నుండి విడుదల చేస్తున్న వార్తలకూ, ఇరాక్ పాలకవర్గ ప్రకటనలకూ పొంతనే లేకుండా పోయిందంటారు. తొలుత ఇరాక్ వార్తలను దబాయించినా, దుష్టకూటమి తరువాత ధృవపర్చక తప్పదని డొల్లతనాన్ని ఎండగట్టినట్టయింది. ఈ వైరుధ్య వార్తల నేపథ్యంకు దుష్టకూటమి సైన్యాధికార వర్గం నేత మయెర్స్ 'అనవసర వాగుడొద్దని' తమదళాలను హెచ్చరించాల్సివచ్చిందనే ఊటకింపుతో తన వాదనను బలపర్చుకున్నట్టయింది.

అమెరికన్ సామ్రాజ్యవాదం ఇంతవరకూ ఎన్నడూ వినియోగించని అతి పాశవికమైన, మానవుల్ని ముద్దలుముద్దలుగా, ముక్కలు చెక్కలుగా చేసే రాక్షస ఆయుధాలను ఇరాక్‌పై ప్రయోగిస్తుందంటారు. క్లస్టర్ భాంబర్లు, కార్పెట్ బాంబర్లు, ప్రిసిషన్ గైడెడ్ బాంబర్లు వంటి కొత్త ఆయుధాలను వినియోగించడానికి ఇరాకీ సేనలపైన, వాలంటీర్ల పైనా, గెరిల్లాలుగా మారిన ఇరాకీ పౌరులపైనా, రిపబ్లికన్ గార్డ్స్ పైనా దుష్టకూటమి దాడులు చేస్తుందనీ వాపోతారు. పన్నెండేళ్ళుగా ఇరాక్ ప్రజలు పెంపొందించుకున్న సైనిక, ఆర్థిక శక్తులను, ప్రజా మౌలిక సౌకర్యాలను నిర్వీర్యపర్చి, చిందరవందరచేయ దుష్టకూటమి పన్నాగం పన్నిందని, 'ఇరాక్ సర్వ విధ్వంసానికే దుష్టకూటమి సమాయత్తం' అన్న సంపాదకీయంలో యుద్ధవికృత్వాన్నీ చూపగలిగారు.

"ఇరాక్‌లో మారణాస్త్రాలు, రసాయన క్రిమి ఆయుధాలు భారీఎత్తున ఉత్పత్తి సాగుతుందన్న మిషతో దాడికి దుష్టకూటమి పాల్పడింది" ఇలా అన్నదెవరంటే ఆయుధ తనిఖీలు నిర్వహించిన సమితి సాధికార నిపుణుల బృంద నాయకుడు హాన్స్‌బ్లిక్స్. అస్సలు ఇరాక్‌పై యుద్ధం చేయాలన్న నిర్ణయానికి అమెరికా-బ్రిటన్‌లు చాలాకాలం క్రితమే వచ్చాయనీ బ్లిక్స్ వెల్లడించడాన్నీ చెప్తూ ఇరాక్‌పై యుద్ధం ఓ పథకం ప్రకారం జరిగిందనే అభిప్రాయాన్ని బలపర్చ గలిగారు. అంతటితో ఆగకుండా తమ పన్నాగాన్ని నెరవేర్చు కునేందుకై అమెరికా-బ్రిటన్‌లు సాక్ష్యాలను సైతం తారుమారు చేశాయని 'బ్లిక్స్' ఆగ్రహం వ్యక్తం చేశారట. సమితి ఆయుధ తనిఖీ బృంద నాయకునిగా బ్లిక్స్ చేసిన ఈ ప్రకటనల దృష్ట్యా ఇరాక్‌పై ఏకపక్షంగా దాడికి కారకులైనవారంతా యుద్ధ నేరస్థులేనని స్పష్టం చేలగలిగారు.

అలా అయినపుడు రెండో ప్రపంచ యుద్ధం తరువాత సామ్రాజ్యవాద ఫాసిస్టు జోక్యందారీతనానికి వ్యతిరేకంగా ప్రపంచ శాంతి స్థాపనకై ఏర్పర్చుకున్న ఐక్యరాజ్యసమితిని, దాని భద్రతా మండలి తీర్మానాలనూ లెక్కచేయకుండా దురాక్రమణ యుద్ధం ప్రకటించి ఇరాక్ సార్వభౌమాధికారాన్ని చెరచి ఆ దేశప్రజలను చంపడానికి, వారి సాంస్కృతిక వారసత్వాన్ని ధ్వంసం చేయడానికి వెరవని జార్జిబుష్-టోనీ బ్లెయిర్‌లను యుద్ధ నేరస్తులుగా పరిగణించాల్సిన 'సమయం' వచ్చిందంటారు. నలుపెరుగని గురువింద గింజల్లా "సద్దాంతో సహా ఇతర సైనికులు, ఆఫీసర్లను ఇంటర్‌నేషనల్ ట్రిబ్యునల్స్ ద్వారా విచారణ ప్రారంభించాలని" బుష్-బ్లెయిర్‌లు మొరుగుతున్నారంటూ... ఇందుకు భిన్నంగా ప్రపంచ దేశాల ప్రజలు ఇరాక్ ప్రజలకు బాసటగా నిల్చి, యుద్ధ నేరస్థుల విచారణ జరిగితీరాలని పట్టుపట్టాలనీ, నినదించాలనీ కర్తవ్యోన్ముఖుల్ని చేస్తారు.

యిలా ఈ 'యుద్ధ నేరస్థులు బుష్-బ్లెయిర్' సంపాదకీయ సంకలనం అనేకానేక చారిత్రక ఘటనా వివరణలను మనముందు ఉంచుతుంది. సామ్రాజ్యవాద దురహంకార ప్రవర్తనని ఎండగట్టే క్రమంలో మొత్తంగా 'సామ్రాజ్యవాదం'పై శల్యపరీక్ష జరిగిందని

చెప్పుకోవడం సమంజసంగా వుంటుందనిపిస్తుంది. రాజకీయ పరంగా అంటే రాజకీయ పరిభాషలో సామ్రాజ్యవాదాన్ని దుష్ట పరిణామాలను వివరించే యత్నాలతో పోల్చిచూసినపుడు ఇరాక్‌పై అమెరికా సామ్రాజ్యవాదం జరిపిన దాడి ఈ సందర్భంగా ఉటంకించిన సందర్భోచిత వ్యాఖ్యలు, వ్యాఖ్యానాలూ చాలా బలంగా పాఠకుల్ని కదిలించగలిగాయని చెప్పక తప్పదు. వెరసి ఈ సంకల నాన్ని తిరగేస్తే సామ్రాజ్యవాద చరిత్ర పూర్వాపరాలనే పాఠకులకు అందించేంత విస్తృతిని, వాడినీ ఈ వ్యాసాలు కలిగిఉన్నాయనటంలో సందేహం ఏమాత్రం లేదు.

యిహ పోతే, సంపాదకీయ రచనలో పాటించాల్సిన నాలుగంశాలు - ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్, ఎనాలిసిస్, లాంగ్వేజ్‌లు. ఈ సంపాదకీయాల్లో ఈ అంశాలన్నీ తగు పరిపుష్టితో వున్నాయి. సమాచారాన్నంతా అందివ్వాలనే తపనలో విషయ ప్రకటన కాస్తా ముందూ వెనకా అయి విషయాన్ని ఒకటికి రెండుసార్లు చదివేలా చేస్తుంది. భాషను కాస్తా సరళీకరించడం అవసరమనిపిస్తుంది. సామాన్య కార్యకర్తలకు అవగాహనను ఇవ్వాలంటే ఇది అవసరం. ఈ యుద్ధ కుతంత్రాలతో పాటు ఇరాకీ ప్రజలు యుద్ధ సమయంలో ఎదుర్కొన్న కష్టాలు-కడగండ్లనూ తెలిపే ఒకటి రెండు వ్యాసాలు చేరిస్తే మరింత పరిపుష్టంగా వుండేది. ఇక్కడ ప్రస్తావించుకోవలసిన మరో అంశం సామాజిక బాధ్యతగా ఒక దురాగతం పట్ల స్పందించి, అందుకు సంబంధించిన సమస్త విషయాన్ని పాఠకులకు అందివ్వాలనే తపన. ఆ తపనతో విషయ సేకరణకై చేసిన కృషి, శ్రమ అంత తక్కువేమీ కావు. అది ఒక్క 'నిబద్ధత' కలవారికే సాధ్యమవుతుంది. ఆ నిబద్ధతకు అక్షరరూపమే ఈ 'యుద్ధ నేరస్థులు బుష్-బ్లెయిర్' సంకలనం.

భావితరాల ముందున్న పెనుప్రమాదం ఈ అమెరికన్ సామ్రాజ్యవాదమనే వాస్తవాన్ని గుర్తెరిగి, ఈ వ్యాస సంకలనాన్ని ప్రచురించి అతి స్వల్పధరకే అందుబాటులోకి తెచ్చిన ప్రజాపంథా ప్రచురణవారు అభినందనీయులు.

(22 వ్యాసాలను కలిగివున్న ఈ "యుద్ధ నేరస్థులు బుష్-బ్లెయిర్" సంకలనం సుమారు అన్ని ప్రముఖ పుస్తకాలయాల్లోనూ లభిస్తుంది. రచన : ఎ.బి.కె. - ప్రజాపంథా ప్రచురణలు, హైదరాబాద్-44 - 100 పేజీలు - వెల 15 రూ.లు).

- విద్యాభూషన్

ఈ వ్యవసాయ సంస్కరణలు రుచిస్తాయా?

చంద్రబాబు పాలనలో సరికొత్తగా భక్తిరసం తెప్పలు తెప్పలుగా పారుతోంది. తిరుపతి వెంకటేశ్వరస్వామి జిల్లాల్లో బ్రాంచి దేవాలయాలు వెలుస్తున్నాయి. ప్రతి గ్రామానికి మంచినీళ్ళుంటాయో లేదో కాని, గుడిమాత్రం కట్టిస్తారట. అలాగే చంద్రబాబుకు హఠాత్తుగా రైతులమీద, వ్యవసాయం మీద ప్రేమ ప్రారంభమై పొంగిపొరలుతోంది. రైతులకు ఏం కష్టం వచ్చినా సహించేది లేదని కలెక్టర్లకు హెచ్చరికలు జారీచేశారు. కోటివరాలలో భాగంగా వ్యవసాయానికి రూ. 700 కోట్లు కేటాయించి, రైతులకు భూతలస్వర్గాన్ని సృష్టించేస్తామంటున్నారు. విప్లవమో, వీరస్వర్గమో అన్నంతజోరుగా, హుషారుగా అని పాట పాడుతున్నారు. భూసంస్కరణలు అమలుపరచి, గ్రామీణ జీవితంలో ఒక వ్యవస్థాగత మార్పు తీసుకొనిరానిదే గ్రామాలు ఎక్క డున్నవి అక్కడే వుంటాయి. కాని పాలకులకు భూసంస్కరణ లంటే ఎర్రజెండా చూచినంత భయం కాబట్టి, అది కమ్యూనిస్టుల నినాదం కాబట్టి, కనీసం కమ్యూనిస్టేతరులు చెప్పినదైనా వినాలిగా. ఉదాహర ణకు ప్రముఖ జర్నలిస్టు కుల్‌దీప్ నాయర్ చేసిన ఎర్రరంగు లేని సంస్కరణలైనా చేబడతారా? ఆయన పంచసూత్రాలు సూచించారు.

1. అభివృద్ధి కార్యక్రమాలను అత్యధిక సంఖ్యాకులు నివసించే గ్రామాలపై కేంద్రీకరించాలి.
2. ఆహార భద్రతా కార్యక్రమం కేవలం సంక్షేమ దృష్టితోకాక, ఉపాధికల్పనపై కేంద్రీకరించినపుడే, ప్రజల కొనుగోలుశక్తి పెరిగి, నిజమైన ఆహార భద్రత చేకూరుతుంది.
3. భూవిస్తీర్ణం పెరిగే అవకాశం లేని నేపథ్యంలో, అలాగే రసాయనిక ఎరువుల వాడకం ప్రతికూల ఫలితాలనిస్తున్న నేపథ్యంలో, వ్యవసాయంలో పరిశోధన, టెక్నాలజీ, విస్తరణ సేవలకు పెద్దపీట వెయ్యాలి.
4. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ పునరుద్ధరణ చిన్న కమతాల ఆధారంగా జరగాలి.
5. మార్కెటింగ్, వ్యాపారం సమర్థవంతంగా సాగించాలి. ఈ సూచనలేమీ కొత్తవికావు. ఇవి వ్యవసాయార్థిక శాస్త్రవేత్తలు ఎప్పటినుంచో చేస్తూవచ్చిన సూచనలే. కేటాయించిన రూ. 700 కోట్లు పప్పుబెల్లాల్లా పంచిపెట్టకుండా వాటిలో ఏ ఒకటి, రెండు సూచనల మీదనైనా కేంద్రీకరించి ఖర్చుచేస్తే ఆమేరకు ఫలితం దక్కుతుంది. ○

మెతుకుమీద నెత్తుటి మరక!

- ఎన్. వేణుగోపాల్

కడుపార గడువగా గడ్డియైనను లేక
యెడ్లు దొడ్లను జేరి యెత్తుపడెను
చినుకులెండకు చాటు చిన్న పందిరి లేక
సారహీనత వెంట చేరబడెను
ప్రాత నాగలిచేత లోతు చాలును లేక
తెగులుచే పైరెల్ల తెల్లబడెను
నాలితే పనిచేయు పాలేరు చెలి లేక
కూలినాలిది రాక కూలబడెను
ఇన్ని ఇక్కట్టులక్కటా పన్నుదప్ప
దదను దప్పిన నెవ్వార లాదుకొనరు
కనులు ముకుళించి కాలంబు గడుపుచుండ
హాలికా! నీకు నింకేమి యాసగలదు

రైతులకు ఆశలేని ఈ స్థితిని వర్ణిస్తున్న ఈ పద్యం ఇవాళ్టికి కూడా వర్తిస్తుంది గాని ఇవాళ్టిది కాదు. అరవైనాలుగు సంవత్సరాల కింద గంగుల శాయిరెడ్డిగారు రాసిన వ్యవసాయ పద్య కావ్యం 'కాపుబిడ్డ'లో రైతుల వెతలను చూసేవారెవరని ప్రశ్నిస్తూ సాగిన పద్యమాలికలోని ఒక పద్యం ఇది.

తెలుగు కాలచక్రంలో అరవై సంవత్సరాలు తిరిగితే కాలం మళ్ళీ మొదటికొస్తుంది. అసలు వ్యవసాయ నాగరికతలలో పన్నెండునెలలు తిరిగితే కాలం మళ్ళీ మొదటికొస్తుంది. నిజంగా ఈ సమాజానికి అన్నం పెట్టిన రైతుకు, ఆరుగాలం బురదలో చెమటోడ్చిన రైతుకూలికి ఎప్పుడూ 'ఇంకేమి యాస గలదు' అనే పరిస్థితే వుంటోంది. దానికి మొదలూ లేదు, తుదీ లేదు.

వచ్చిన మార్పల్లా ఏమంటే అరవై ఏళ్ళకింద ఆశలేని పరిస్థితుల్లో కూడా రైతులు జీవితం కొనసాగించారు. మళ్ళీ కాలం రాగానే దుక్కులు దున్నారు. కాలం కాకపోయినా, కార్తెలు వెనక్కి పోయినా విత్తులు నాటారు. తెగుళ్ళుపట్టినా కోతలు కోశారు. పంట చేతికి రాకపోయినా 'కనులు ముకుళించి కాలంబు గడిపారు' ఎవ్వారలాదుకొనకపోయినా బతుకుమీద విశ్వాసం వదులుకోలేదు. మళ్ళీ కాలంకోసం ఎదురుచూశారు. ఆరు దశాబ్దాలు గడిచేసరికి తెలుగుసమాజం ఎంత ముందుకు పోయిందంటే, ఎంత అభివృద్ధి సాధించిందంటే ప్రపంచంలోకెల్లా అత్యద్భుత ఆశాజీవి రైతు చేతులెత్తేసి ఆత్మహత్యను ఆశ్రయించడం మొదలుపెట్టాడు. బహుశా శాయిరెడ్డిగారు చూసిన రైతుకన్నా ఎక్కువ హైటెక్ అవకాశాలు, హైటెక్ విత్తనాలు, హైటెక్ ఎరువులు, క్రిమిసంహారక మందులు దొరకడమే ఇవాళ్టి రైతులపాలిట శాపం కావచ్చు.

రైతుల ఆత్మహత్యలను నివారించే చర్యలు చేపట్టమని కోరుతూ సిపిఐ(ఎం) అటు రాష్ట్ర ప్రభుత్వానికి, ఇటు గవర్నర్‌కు సమర్పించిన నివేదిక చూస్తే ఇదివరకు తెలిసిన సంగతులే అయినా మరొక్కసారి కడుపు తరుక్కుపోతుంది. ఈ నెత్తుటికూడులో మనదెంత భాగమని కడుపులో మెతుకులు ఘోషిస్తాయి.

కొత్త సంవత్సరం ప్రవేశించి ఇరవైరోజులు గడవకుండానే ఇరవైరెండు మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. నాలుగు సంవత్సరాలలో అంటే 1998 నుంచి ఇప్పటికి మొత్తం 633 మంది రైతులు ఆత్మహత్యల బారినపడి చనిపోయారని సిపిఐ(ఎం) నివేదిక తెలుపుతోంది. నిజానికి ఈ అంకె పత్రికలకెక్కి "ఆత్మహత్య"గా నమోదైన బలవన్మరణాల సంఖ్యేగాని వాస్తవంగా ఆకలిచావుల కింద, అనారోగ్యం చావుల కింద, పత్రికలకు ఎక్కకుండా జరిగిన రైతుల బలవన్మరణాలన్నిటినీ కలిపి లెక్కవేస్తే కనీసం రెట్టింపుమంది రైతులు ఈ నాలుగేళ్ళలో ప్రాణాలు కోల్పోయి వుంటారు. ప్రకటించిన అసమగ్ర సమాచారం నుంచి చూసినా వరంగల్, అనంతపురం, కరీంనగర్ జిల్లాలు ఆత్మహత్యల జాబితాలో మొదటి మూడు స్థానాలు ఆక్రమిస్తున్నాయి.

సిపిఐ(ఎం) చేసిన విజ్ఞప్తికి కనీస స్పందనను కూడా ప్రదర్శించ కుండా రాష్ట్ర ప్రభుత్వం తనకు హృదయం లేదని మరొకసారి చూపుకుంది. సిపిఐ(ఎం) విజ్ఞప్తి తర్వాత రెండువారాలు గడిచిపోయినా, మధ్యలో ఒకసారి మంత్రివర్గ సమావేశం కూడా జరిగి రాష్ట్రంలో 992 మండలాలు కరువుబారిన పడ్డాయని గుర్తించినా, రైతుల ఆత్మహత్యల గురించి, నివారణా చర్యల గురించి పల్లెత్తుమాట కూడా ప్రభుత్వం నుంచి రాలేదు. రాష్ట్రంలోని 1100 మండలాలలో దాదాపు 90 శాతం మండలాలను కరువు మండలాలుగా గుర్తించిన ప్రభుత్వం ఆ కరువు ఫలితం ప్రజలమీద, రైతుకూలీల మీద ఎట్లా ఉండబోతోందో, ఆ దుస్థితిని నివారించ డానికి తానేమి చేయాల్సిఉందో ఆలోచించిందా? ఏ విదేశీ వేదికల మీద ఈ రాష్ట్రాన్ని, రాష్ట్ర సంపదలను అమ్మజూపాలి, ఏయే వర్గాలను మోసం చేయడానికి ఏయే గప్పాలు కొట్టుకోవాలి అనే ఆలోచనలు తప్ప మహాఘనత వహించిన ఏలినవారి బుర్రలో ఈ నేలమీది కష్టజీవుల కడగండ్ల గురించి ఆలోచించడానికి ఒక్క చదరపు మిల్లీమీటర్ స్థలమైనా వుందా? అది కూడా రియల్ ఎస్టేట్ వేలం పాటల్లో, కమిషన్ వేటల్లో మునిగిపోయిందా?

ఇంతకూ సిపిఐ(ఎం) కోరిన నివారణ చర్యలేమన్నా గొంతెమ్మ కోర్కెలా? వరుసగా కరువుకు గురై పంటలు నష్టపోయిన ప్రాంతాల్లో పదిఎకరాల లోపువారికి రుణాలు రద్దుచేయాలని, అంతకన్నా ఎక్కువ భూమి వున్నవారికి వడ్డీ, అపరాధపు వడ్డీలను మాఫీ చేయాలని, ప్రత్యేక పరిస్థితులు నెలకొని వేరుశనగ రైతులు విపరీతంగా ఆత్మహత్యలు చేసుకుంటున్న అనంతపురం జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటించాలని, విద్యుత్ బిల్లుల వసూళ్ళను వాయిదా వేయాలని, రైతుల ఆస్తులను జప్తుచేసి వేలం వెయ్యడాన్ని ఆపాలని, ఆత్మహత్యల సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని, కనీసం ఆ

సమస్యను కూలంకషంగా చర్చించడానికి ఒక అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేయాలని సిపిఐ(ఎం) కోరింది.

ఈ డిమాండ్లలో ఏ ఒక్కదాన్నయినా నెరవేర్చడం ప్రభుత్వానికి అసాధ్యం కాదు. నిజానికి ఈ విజ్ఞాపన పత్రం అందిన తర్వాతనే సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పరిశ్రమకు కోట్లాది రూపాయల రాయితీలు ఇవ్వాలని నిర్ణయించింది. కొత్త స్పెషల్ ఎకనామిక్ జోన్ల ఏర్పాటుకు, అంటే విదేశీ పెట్టుబడి దారులకు, స్వదేశీ మిలాఖతుదారులకు వందలకోట్ల రూపాయల సబ్సిడీలు, రాయితీలు ఇవ్వడానికి నిర్ణయించింది. కొన్ని పదుల కోట్ల రూపాయలకు మించని రైతాంగ డిమాండ్లమీద మాత్రం చర్చించడానికి, ఆలోచించడానికి మంత్రివర్గానికి సమయం చాలలేదు.

ఒకవైపు రైతులు చచ్చిపోతుంటే, కుటుంబ పెద్దలు, ఏకైక సంపాదనాపరులు ఆత్మహత్యలు చేసుకొని కుటుంబాలకు కుటుంబాలు వీధిన పడుతుంటే, వ్యవసాయం చేయగూడని వృత్తి అయిపోతూ సామాజిక మనుగడే ప్రశ్నార్థకమైపోతుంటే, ఏమీ పట్టనట్టు, నిమ్మకు నీరెత్తినట్టు కూచున్న ప్రభుత్వం, మరోవైపు చాలా గంభీరంగా, ఆకర్షణీయంగా "ఇదిగో చేశాం చూసుకో" అని చూపడానికన్నట్లుగా "సమగ్ర వ్యవసాయాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను సూచించడానికి" ఒక మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. "ఉపసంఘాన్ని నియమించాం గదా, దాని ప్రతిపాదనలు రాగానే చర్య తీసుకుంటాం" అని ఇంకో నాలుగు నెలలు, ఎండాకాలమంతా తాత్సారం చేస్తారు. వర్షాలు పడడం మొదలుకాగానే ఎట్లాగూ సమస్య తీవ్రత తగ్గుతుంది కనుక అసలు ఆత్మహత్యల సంగతే అందరూ మరచిపోతారు.

ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి ఒక్కొంటికి లక్ష రూపాయల చొప్పున నష్టపరిహారం ఇచ్చినా ఆ కుటుంబాలకు ఎంతో మేలు చేసినట్టువుతుంది. ప్రభుత్వం అంగీకరించక తప్పని, పత్రికలలో వచ్చిన లెక్కల ప్రకారమే తీసుకున్నా 633 మంది చనిపోయిన రైతుల కుటుంబాలకు ఇవ్వవలసిన నష్టపరిహారం ఆరున్నరకోట్ల రూపాయలకు మించదు. అది ఈ ప్రభుత్వాధినేత తన సొంత ప్రచారం మీద పెట్టే ఖర్చులో రెండుశాతం కూడా కాదు. రెండుశాతం ప్రచారం తగ్గినందు వల్ల ఏలినవారి కీర్తికిరీటం ఏమీ పడిపోదు.

పది ఎకరాల లోపు రైతులకిచ్చిన రుణాల రద్దు డిమాండ్ కూడా అంత తీవ్రంగా అభ్యంతర పెట్టవలసిందేమీ కాదు. అసలు ఈ రాష్ట్రంలో రైతాంగానికి ఇచ్చిన వ్యవసాయ రుణాలే చాలా తక్కువ. అందులోనూ పది ఎకరాలలోపు ఆసాములకు ఇచ్చిన రుణాలు ఇంకా తక్కువ వుంటాయి. ప్రైవేట్ విద్యుత్ సంస్థలకు వాళ్ళు విద్యుత్ తయారుచేయకుండానే, ఆ విద్యుత్తును ప్రభుత్వం కొనకుండానే, ప్రజాధనంలోంచి అప్పనంగా అందిస్తున్న వందలాది కోట్ల రూపాయలతో ఎల్ అండ్ టి, ఇండియా సిమెంట్స్ వంటి పెట్టుబడిదారులకు ఈ రాష్ట్ర సంపదల్లోంచి అందిన వేలాదికోట్ల రూపాయలతో పోలిస్తే కష్టంలో వున్న రైతులకు మనం ఈ మాత్రం చేయూత ఇస్తే తప్పేమీ కాదు.

ఇక వడ్డీల మాఫీ, రుణవసూళ్ళ వాయిదా, పీడిత ప్రాంతానికి ముఖ్యమంత్రి పర్యటన వంటివి ప్రభుత్వం ఎవరూ అడగకుండానే చేయాల్సిన సహజ న్యాయసూత్రాల డిమాండ్లు. వాటినికూడా ఒక ప్రతిపక్షపార్టీ అడగాల్సివస్తున్నదంటే, అడిగినా ప్రభుత్వం బధిరాంధ్ర మౌనం పాటిస్తున్నదంటే మనం ఎంత అనాగరికమైన పాలనకింద ఉండిఉండాలి!

నిజానికి ఇవాళ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలన్నిటికీ మూలకారణం ఈ ప్రభుత్వం వ్యవసాయరంగం పట్ల అనుసరిస్తున్న విధానాలలో వుంది. ముఖ్యంగా ఈ దేశంలోను, రాష్ట్రంలోను నూతన ఆర్థిక విధానాలు అమలుకావడం మొదలైనప్పటినుంచి జరుగుతున్న పరిణామాలన్నిటి ఫలితమే ఈ ఆత్మహత్యలు.

వ్యాపార పంటలపై మోజు పెంచి తద్వారా విత్తనాలలో, ఎరువులలో, క్రిమిసంహారక మందులలో, వ్యవసాయ పరికరాలలో, దిగుబడికి మార్కెట్‌లో మన వ్యవసాయాన్ని బహుళజాతి ప్రయోజనాల రథచక్రాలకు కట్టివేసిన ఫలితంగానే మన గ్రామాలు ఆత్మహత్యల బాటపడ్డాయి. ఆ వ్యాపార పంటల మార్కెట్లు విదేశీ సంస్థల చేతుల్లో ఉండడం వల్ల ఇక్కడ గిట్టుబాటు ధరలు దొరక్కపోవడం సహజమైపోయింది. మరోవైపు ఆ వ్యాపార పంటలు (ప్రభుత్వ విజన్ 2020 పరిభాషలో ఎక్కువ విలువైన పంటలు) వేయాలంటే ఎక్కువ పెట్టుబడులు పెట్టవలసిరావడంతో వస్తుందో, రాదో, ఎంత వస్తుందో తెలియని ఆదాయం కోసం విపరీతమైన వ్యయం రైతుల నెత్తిన పడింది. ఎప్పుడూ నిరాశనెరుగని రైతు మొట్టమొదటిసారిగా అప్పుల విషవలయంలోంచి బయటబడలేనని గుండెపగిలాడు. గుండె పగిలిన రైతుకు చేతిలో అవలీలగా, సౌకర్యంగా వున్న క్రిమిసంహారక మందుకు ఉన్న మరో ఉపయోగం తెలిసివచ్చింది.

మరోవైపు సబ్సిడీల కోతలు, కరెంట్ ఛార్జీల పెంపు, సంక్షేమ పథకాల రద్దు, అన్నివైపుల నుంచీ మూసుకొచ్చిన మృత్యువు రైతును తనవెంట తీసుకుపోయింది.

నిజంగా ఇవాళ రైతు ఆత్మహత్యల గురించి ఆలోచించాలంటే, ఆ ఆత్మహత్యలను నివారించాలంటే ఇంత దీర్ఘకాలపు చరిత్రను తవ్వితీయాలి. రైతు ఎక్కడెక్కడ మోసానికి, ద్రోహానికి గురయ్యాడో లెక్కలు తేల్చాలి. ఎవరెవరికి ఈ పాపంలో ఎంత భాగం ఉందో తేల్చాలి. స్వయంగా ప్రభుత్వానికే ఆ పాపంలో సింహభాగం ఉన్నదనేది తప్పకుండా తెలుసుకోవాల్సిన నిజం. ఆ నిజం తెలుసు కనుకనే ప్రభుత్వానికి ఈ పాపం గురించి కూలంకషంగా చర్చించాలనే కోరిక లేదు.

కాని మనకైనా కనీసం ఆ కోరిక ఉండొద్దా? తినే ప్రతి గింజమీదా తినేవారి పేరుంటుందంటారు. అది ఎంత నిజమో గాని, ప్రతి గింజలోనూ రైతుకూలీల నెత్తురు చెమటా ఉంటుంది. ఆ మెతుకు ఇవాళ మనను ప్రశ్నిస్తోంది. ○

ఐక్య సంఘటన వ్యూహం-ఎత్తుగడలు

- కొల్లి సత్యనారాయణ

ఐక్యరాజ్య సమితిని, భద్రతా మండలిని ధిక్కరించి, ప్రపంచ ప్రజాభిప్రాయాన్ని ఖాతరు చేయకుండా ఫాసిస్టుగా తయారైన, కోర్టు ఎంపికలో అమెరికా అధ్యక్షుడైన జార్జి బుష్, లేబర్ పార్టీ పేరుతో అధికారంలోకి వచ్చిన టోనీ బ్లెయిర్ కూటమి ఎలాంటి కవ్వింపు చర్య లేకుండానే ఇరాక్‌పై యుద్ధం ప్రకటించి, ఆక్రమించు కోవటంతో ప్రపంచంలోనే నూతన రాజకీయ పరిణామం జరిగింది. ప్రపంచానికే మరొకమారు ఫాసిస్టు ప్రమాదం ఈ దుష్ట కూటమి వల్ల ఏర్పడింది. ప్రపంచ శ్రామిక వర్గానికి, అభ్యుదయ శక్తులకు మరొక పర్యాయం జీవన్మరణ సమస్య ఎదురైంది. రెండవ ప్రపంచ యుద్ధం ముందునాటి పరిస్థితులు యిప్పుడు పునరావృతమయ్యాయి. అందువల్ల ఇప్పుడు కావలసింది నయా ఫాసిస్టు కూటమిని ధ్వంసం చేయటానికి, ఆనాడు ఫాసిస్టు వ్యతిరేక (కూటమి) ఫ్రంట్ ఏర్పడినట్లుగా ఈనాడు కూడా ఒకే ఒక ఫాసిస్టు బుష్-బ్లెయిర్ వ్యతిరేక (కూటమి) ఫ్రంట్ ఏర్పాటు తక్షణ అవసరం. తటపటా యింపులు, కాలయాపనలతో కాలం వెళ్ళబుచ్చితే, ప్రపంచం మరొక పర్యాయం అంధకార యుగంలోకి పోవటం, హిట్లర్ సాధించలేక పోయిన లక్ష్యాన్ని ఈనాడు బుష్-బ్లెయిర్ దుష్టకూటమి సాధించ టానికి తోడ్పడటమే అవుతుంది.

ఆనాడు ప్రజాశక్తులకు అండగా, అగ్రగామి దళాధిపతిగా కామ్రేడ్ స్టాలిన్ నాయకత్వాన సోవియెట్ యూనియన్ ఉండటం వల్లనే ఫాసిస్టు శక్తులను ధ్వంసం చేయటం సాధ్యమైంది. సోషలిస్టు శిబిరం ఏర్పడింది. సామ్రాజ్యవాద శక్తుల ఆశలకు, దూకుడుకు కళ్ళెం వేయటం జరిగింది. పలు మూడవ ప్రపంచ దేశాలు విముక్తి పొందాయి.

ఐక్యరాజ్య సమితిలో, భద్రతా మండలిలో సోవియెట్ యూనియన్ తన వీటో హక్కును ఉపయోగించి సామ్రాజ్య వాదుల దురాక్రమణ చర్యలను అడ్డుకుంటూ వచ్చింది. ఎంతో పోరాటం జరిపిన తరువాత గానీ, వందకోట్ల జనాభా కలిగిన చైనాకు ఐక్యరాజ్య సమితి సభ్యత్వం, వీటో హక్కులు లభించలేదు.

సోవియెట్ యూనియన్‌లో స్టాలిన్ చనిపోయిన తరువాత అధికారంలోకి వచ్చిన కృశ్చేవ్ ముఠా, నెమ్మదిగా కుమ్మరి పురుగు మాదిరిగా సోవియెట్ యూనియన్‌లో సోషలిస్టు వ్యవస్థకు తూట్లు పొడిచింది. సోవియెట్ శిబిరమే లేకుండా పోయింది. ఇంక ప్రచ్ఛన్న యుద్ధం ప్రారంభమైంది. ఇంక శత్రువులు ఎవరో తేలిపోయినప్పుడు ఫ్రంట్ ఎందుకు? అన్న ప్రశ్న ఉదయిస్తుంది

సమాజంలో గుత్త పెట్టుబడిదారులు, బడా పెట్టుబడి దారులు, జాతీయ పెట్టుబడిదారులు, దళారీ పెట్టుబడిదారులు, భూస్వాములు, ధనిక రైతులు, మధ్యతరగతి రైతులు, పేద రైతులు, వ్యవసాయ కూలీలు, తెల్లచొక్కా కార్మికులు, నైపుణ్యం గల కార్మికులు మొదలైన వారు ఉన్నారు. వీరందరూ గీత గీసినట్లుగా చీలి వున్నారా? అంటే లేరు. అంతా కలగా పులగం. వీరిలో వీరికి వైరుధ్యాలు ఉన్నాయి. పై తరగతులలో వున్న ఈ వైరుధ్యాలు ప్రజల సంక్షేమం కోసం కాదు, వారి స్వప్రయోజనాల కోసం.

అయితే, సమాజంలో అట్టడుగున ఉన్న వ్యవసాయ కూలీలు మొత్తం జనాభాలో ప్రభుత్వ లెక్కల ప్రకారమే 80 శాతం మంది వరకూ వున్నారు. వీరంతా పలు సామాజిక అంతస్తులలో చీలి వున్నారు. శ్రామికులందరూ కలిసికట్టుగా లేరు. వివిధ తరగతులలో చేరివున్నారు. వీరందరినీ ఒకే గొడుగు క్రిందకు తీసుకురావలసి వుంది. వీరిలో వున్న చీలికలను దోపిడీ వర్గాలు చక్కగా తెలివితేటలతో, మతం పేరుతో భారతదేశంలో అయితే మతంతో పాటు కులాన్ని కూడా ఉపయోగించుకుని, "విభజించి పాలించు" అన్న విధానాన్ని చాకచక్యంగా అమలుజరుపుతున్నారు.

దోపిడీ నుండి విముక్తి పొందాలంటే సామాజికంగా, ఆర్థికంగా, వీటివల్ల లభించే అధికారం గల బలవంతుడైన శత్రువును ఎదుర్కొనక తప్పదు. చీలికలు, పీలికలుగా వున్న శ్రామిక వర్గాన్ని కూడగట్టుకో వలసిన అవసరం, దానితోపాటు మన బలం పెంచుకోవటానికి మిత్రులను సంపాదించుకోవలసిన అవసరం ఎంతైనా వుంది. ఆ ప్రయత్నమే ఐక్య సంఘటన ఏర్పాటు.

ఫ్రంట్ ఏర్పరచాలని నిర్ణయం చేసుకున్నప్పుడు ఎవరికి వ్యతిరేకంగా ఎవరితో కలిసి ఫ్రంట్ కట్టాలి? అన్న సమస్య తలెత్తుతుంది. ఒకే సమయంలో శ్రామిక వర్గానికి వ్యతిరేకంగా పలువురు శత్రువులు వుంటారు. వారందరితోనూ ఒకే సమయంలో పోరాడలేము గదా. ఆ విధంగా పోరాడితే, మన బలం మరింత బలహీనమవుతుంది గదా. కాబట్టి మన బలం చెక్కుచెదరకుండా, శత్రుబలాన్ని తగ్గించే విధంగా మన వ్యూహం వుండాలి. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో శ్రామిక వర్గానికి వ్యతిరేకంగా ఒకప్రక్క అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ వంటి సామ్రాజ్యవాద దేశాలు, రెండవ ప్రక్కన సామ్రాజ్యవాదులు పెంచి పోషించిన జర్మనీ, జపాను, ఇటలీ ఫాసిస్టు శక్తులు నిలబడ్డాయి. అప్పుడు శ్రామికవర్గం ఏం చేయాలి. శ్రామికవర్గం అధికారంలో వున్న సోవియెట్ యూనియన్ ఏమి చేసింది? ఇప్పుడు భారతదేశంలో సి.పి.ఐ., సి.పి.ఐ.(ఎం) పార్టీలు చెబుతున్నట్లుగా మూడవ ఫ్రంటు ఏర్పాటు చేయలేదు. ఫాసిస్టు శక్తులకు

వ్యతిరేక ఫ్రంటు ఏర్పాటుకు కామ్రేడ్ స్టాలిన్ పిలుపునిచ్చాడు. ప్రపంచ ప్రజలకు ప్రధాన శత్రువు ఫాసిజమని చాటాడు. అన్ని దేశాలలోని శ్రామిక వర్గం ఫాసిస్టు వ్యతిరేక ఫ్రంట్‌లను బలపర్చాలని, అందుకు బలమైన ఉద్యమాన్ని నిర్మించాలని ఉద్బోధించాడు. అంతేగానీ మూడో ఫ్రంట్ ఏర్పాటుకు పిలుపునివ్వలేదు.

ఇచ్చినట్లయితే ఏమయ్యేది? ఒకే పర్యాయం ఫాసిస్టు శక్తులతోనూ, సామ్రాజ్యవాద శక్తులతోనూ పోరాడవలసి వచ్చింది. ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా పోరాడితే, సామ్రాజ్య వాదులు బలపడి, మళ్ళీ అధికారంలోకి వస్తారు గదా, అన్న వాదనతో ఫాసిస్టు వ్యతిరేక ఫ్రంట్‌ను వ్యతిరేకించిన వారు శ్రామికవర్గ శ్రేణులలో లేకపోలేదు. మూడో ఫ్రంట్ ఏర్పాటు చేసినట్లయితే ఏమయ్యేది?

"మనం ఫాసిస్టు శక్తులను ధ్వంసం చేయటానికి యుద్ధం చేస్తున్నాం. కానీ, సోవియెట్ యూనియన్ ఏమి చేస్తున్నది? మనకు వ్యతిరేకంగా పోరాడుతున్నది. అంటే, ఫాసిస్టు శక్తులకు పరోక్షంగా తోడ్పడుతున్నది. సోవియెట్ యూనియన్‌కు ఫాసిజం కంటే మనమే ప్రధాన శత్రువులం. మనల్ని ఓడించి, ప్రపంచంపై పెత్తనం చలాయించాలని కమ్యూనిస్టులు చూస్తున్నారు. బ్రిటిష్ ప్రజలను నాశనం చేయాలని చూస్తున్నారు. అందువల్ల, మనం ప్రధానంగా కమ్యూనిస్టు ప్రమాదాన్ని ఎదుర్కొనాలి" అంటూ బ్రిటిష్ సామ్రాజ్య వాదులు ప్రజలను సోవియెట్ యూనియన్‌కు వ్యతిరేకంగా ద్వేషం రెచ్చగొట్టేవారు. ఆవిధంగా అసలు ఫాసిస్టు శక్తులని పెంచి పోషించినది తామే అయినా, బ్రిటిష్ ప్రజలను మోసగించేవారు. తమ ప్రాబల్యాన్ని కాపాడుకోగలిగేవారు.

అయితే, మూడో ఫ్రంట్ పెట్టకుండా ఫాసిస్టు వ్యతిరేక ఫ్రంట్ ఒక్కటే ఏర్పాటు చేయటం వల్ల బ్రిటిష్, అమెరికన్ సామ్రాజ్యవాదులు సోవియెట్ యూనియన్‌పై దుష్ప్రచారం చేయటానికి వీలు కలిగింది. జర్మనీకి వ్యతిరేకంగా రెండవ రంగం ప్రారంభించమని బ్రిటిష్, అమెరికన్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా ఆయాదేశాలలోని ప్రజలు, ప్రపంచ ప్రజలు ఒత్తిడి తీసుకొచ్చి, రెండవ రంగం తెరిచేటట్లు చేయటానికి మంచి అవకాశం లభించింది.

అంతేకాదు, ఫాసిస్టు వ్యతిరేక ఫ్రంట్ ఒక్కటే ఏర్పాటు చేయటం వల్ల యుద్ధానంతరం సామ్రాజ్యవాదులు తిరిగి ప్రపంచంపై పెత్తనం చలాయిస్తారని వాదించిన వారి వాదనలు తప్పని రుజువయ్యాయి. యుద్ధానంతరం సామ్రాజ్యవాదుల బలం పెరిగిందా? తరిగిందా?

యుద్ధానంతరం సామ్రాజ్యవాదం బలం తగ్గింది. తృతీయ ప్రపంచంలోని పలు దేశాలు వలస బానిసత్వం నుండి విముక్తి పొందాయి. రవి అస్తమించని సామ్రాజ్యం గల బ్రిటిష్ సామ్రాజ్యం అంతరించిపోయింది.

ఇంక శ్రామికవర్గ బలం మరింతగా పెరిగింది. యుద్ధానికి ముందు సోషలిస్టు దేశంగా ఒక్క సోవియెట్ యూనియన్ మాత్రం వుంది. యుద్ధానంతరం తూర్పు యూరప్‌లో పలు దేశాలలో సోషలిస్టు ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. అసలు సోషలిస్టు శిబిరమే ఏర్పడింది. అంతకంటే ముఖ్యమైన విషయం ప్రపంచంలో కల్లా అత్యధిక జనాభా కలిగిన చైనాలో కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడింది. వియత్నాం, ఉత్తర కొరియా, కాంబోడియా దేశాలలో కూడా సోషలిస్టు ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. ప్రపంచ బలాబలాలలో శ్రామిక వర్గపు బలం పెరగటంతో, ప్రపంచ సమస్యల పరిష్కారంలో సోషలిస్టు దేశాలు కీలకపాత్ర వహించే స్థితికి సామ్రాజ్యవాదుల ఆట కట్టించే స్థితికి సోషలిస్టు శక్తుల బలం పెరిగింది. అణచబడిన దేశాలు జరిపే విముక్తి పోరాటాలకు మంచి అండ దొరికింది. సామ్రాజ్యవాదుల దురాక్రమణ యుద్ధాలకు అడ్డు ఏర్పడింది. శ్రామిక వర్గం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన ఫాసిస్టు వ్యతిరేక మూడో ఫ్రంట్ ఏర్పాటు గాక, ఒకే ఒక ఫాసిస్టు వ్యతిరేక ఫ్రంట్ ఏర్పాటు చేయటం వల్లనే సాధ్యమైందన్న విషయం మనం గుర్తుపెట్టుకోవాలి.

ఒక ఒక ఫ్రంట్ ఏర్పాటు చేయటమే సరియైనదని రెండవ ప్రపంచ యుద్ధం అనుభవం మనకు రుజువు చేసింది. అదే విధంగా చైనాపై జపాన్ దండెత్తి వచ్చినప్పుడు చైనా కమ్యూనిస్టు పార్టీ, అప్పటివరకూ తనపై దాడులు చేస్తున్న చైనాలోని కోమింటాంగ్ ప్రభుత్వంకు వ్యతిరేకంగా, జపాన్‌కు వ్యతిరేకంగా మూడో ఫ్రంట్‌కు పిలుపునివ్వలేదు. జపాన్ వ్యతిరేక ఫ్రంటు ఏర్పాటుకే చైనా ప్రజలకు పిలుపునిచ్చింది. జంకైషేక్ ప్రభుత్వం జపాన్‌తో గాక, కమ్యూనిస్టులను నాశనం చేయటానికే తన బలాన్ని, శక్తియుక్తుల్ని ఉపయోగించి నప్పటికీ, మావో నాయకత్వాన జపాన్ వ్యతిరేక ఫ్రంట్‌కే ప్రాధాన్యత నిచ్చింది. చైనా ప్రజల నుండి జంకైషేక్‌ను దూరం చేయగలిగింది. చివరకు సోషలిస్టు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. ఈ అనుభవం కూడా. ప్రధాన శత్రువుకు వ్యతిరేకంగా ఒకే ఫ్రంట్ ఏర్పాటు చేయటమే సరియైనదని రుజువు చేసింది.

"ఒకే సమయంలో శ్రామిక వర్గానికి ప్రపంచంలో గాని, దేశంలో గాని అనేకమంది శత్రువులు వుంటారు. కానీ, వారిలో ప్రధాన శత్రువును ఎన్నుకోవటం ప్రధాన విషయం. ప్రధాన శత్రువును ఎన్నుకుంటే, మిగిలిన సమస్యలు సులభంగా పరిష్కారం అవుతాయి" అని కామ్రేడ్ మావో స్పష్టంగా ప్రకటించారు. అయితే ప్రధాన శత్రువును నిర్ణయం చేసేదెట్లా?

రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో పెట్టుబడిదారీ వర్గాలు:, సామ్రాజ్యవాదులు రెండు వర్గాలుగా చీలిపోయారు. ఒక వర్గానికి బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికా నాయకత్వం వహించగా, రెండవ వర్గానికి జర్మనీ, జపాన్, ఇటలీలు నాయకత్వం వహించాయి. మొదటి ప్రపంచ

యుద్ధంలో జర్మనీ ఓడిపోయినప్పుడు, ఆ దేశాన్ని బలహీన పరచటానికి జర్మనీలోని కొన్ని భాగాలను చీల్చి, తమ మార్కెట్ ప్రాంతాలుగా ఇంగ్లాడ్, ఫ్రాన్స్ దేశాలు ఉపయోగించుకున్నాయి. ఆ ద్వేషం జర్మన్ పాలకవర్గాలకు బాగా వుంది. ద్వేషాన్ని కప్పిపెట్టి, మొదటి ప్రపంచ యుద్ధం తరువాత ఏర్పడిన సోవియెట్ యూనియన్‌ను నాశనం చేయటానికి తయారౌతున్నానని అందుకు తోడ్పడమని, ఇతర సామ్రాజ్యవాద దేశాలను జర్మనీ కోరింది. ఆర్థిక, ఆయుధ సహాయం బ్రిటన్ భారీగా అందించింది. సోవియెట్ యూనియన్‌ను తానుగా ధ్వంసం చేయలేనని గుర్తించిన బ్రిటిష్, ఫ్రెంచి, అమెరికన్ సామ్రాజ్యవాదులు, సోవియెట్‌పై కాలుదువ్వుతున్న, హిట్లర్ నాయకత్వాన వున్న జర్మనీ పెట్టుబడిదారీ వర్గాలకు పూర్తిగా మద్దతు, ప్రోత్సాహం యిచ్చారు. తన ఆయుధ సంపత్తి పెంచుకున్న హిట్లరు, మొదటి ప్రపంచ యుద్ధం సమయంలో పోగొట్టుకున్న జర్మనీ భూభాగాలన్నీ తనకు అప్పగించాలంటూ కొత్త నినాదంతో ముందు కొచ్చాడు. యూరప్‌లోని తన భూభాగాలను ఒక్కొక్క దానిని ఆక్రమించు కోవటం ప్రారంభించాడు. తను పెంచి పోషించిన బ్రహ్మరాక్షసి తనకే ఎదురుతిరిగింది. అప్పుడు బ్రిటన్, ఫ్రాన్సులు జర్మనీపై యుద్ధం ప్రకటించక తప్పలేదు. ఈలోగా సోవియెట్ యూనియన్ తన సైనిక ఆర్థిక శక్తిని పెంచుకోవటం ప్రారంభించింది. జర్మనీతో నిర్యుద్ధ సంధి చేసుకుంది. "అదిగో చూడండి సోవియెట్ యూనియన్ ఫాసిస్టు శక్తులతో సంధి చేసుకుంది" అని శ్రామిక వర్గంలో సోవియెట్ యూనియన్‌పై వ్యతిరేకత రెచ్చగొట్టటానికి ప్రయత్నించింది. ఆ ఎత్తులేమీ పారలేదు.

"ఇది మార్కెట్ల కోసం, దేశాల పునర్విభజన కోసం సామ్రాజ్య వాదులు, ఫాసిస్టు శక్తులు తీసుకొచ్చిన యుద్ధం. ఇది ప్రజలపై మరింత భారం పెంచుతుంది. అందువల్ల శ్రామిక వర్గం ఈ యుద్ధాన్ని వ్యతిరేకించాలి. యుద్ధ చర్యలకు సహాయం చేయకూడదు. ఆయా దేశాలలోని శ్రామిక ప్రజానీకం యుద్ధ వ్యతిరేక ప్రచారం ప్రారంభించాలి. వీలైనచోట్ల ఆయా దేశాలలో దీనిని అంతర్యుద్ధంగా మార్చాలి" అంటూ ప్రపంచ శ్రామిక ప్రజానీకానికి సోవియెట్ యూనియన్ పిలుపునిచ్చింది. అదే సమయంలో ప్రపంచానికి ఫాసిస్టు ప్రమాదాన్ని గురించి హెచ్చరికలు చేస్తూనే వున్నది. ఫాసిస్టు వ్యతిరేక ఫ్రంట్ అవసరాన్ని, ప్రాముఖ్యాన్ని గురించి ప్రజలకు వివరిస్తూనే వుంది. తేలికైన విషయం కాదు. బ్రిటిష్ విమానదళం శక్తివంతమైనదే. హిట్లర్‌కు ఇంక మిగిలింది ఇంగ్లాండ్‌పై బాంబుల వర్షం కురిపించటం. ఇంక పెద్దఎత్తున ఇంగ్లాండ్ పైన, రాజధాని లండన్ పైన బాంబుల వర్షం కురిపించటం ప్రారంభించాడు. నెలలు గడుస్తున్నాయి, అయినా ఇంగ్లాండ్ లొంగలేదు.

ఇదిలా వుంటే హిట్లర్ ఆక్రమించుకున్న యూరప్ దేశాలలో శ్రామిక వర్గం కమ్యూనిస్టుల నాయకత్వాన గెరిల్లా యుద్ధం ప్రారంభించింది. యుద్ధసరుకుల రవాణాను విచ్ఛిన్నం చేయసాగారు. దూర ప్రాంతాలలో వున్న సైన్యానికి మందుగుండి సామాగ్రి, ఆహారం అందటం కష్టమై పోయింది. ఆ విధంగా రెండు రంగాలలో హిట్లర్ శత్రువును ఎదుర్కొన వలసి వచ్చింది. బలం సన్నగిల్లసాగింది.

ఇది ఇలా వుంటే సోవియెట్ యూనియన్ తన ఆర్థిక స్తోమతతో పాటు ఆయుధ సంపత్తిని పెద్దఎత్తున బలపరచుకో సాగింది. హిట్లర్ సైన్యాన్ని ఎదుర్కొనటానికి కట్టుదిట్టమైన రక్షణ ఏర్పాట్లను చేసుకోసాగింది. రోజులు గడచినకొలదీ, ఆర్థికంగా, సైనికంగా సోవియెట్ యూనియన్ అభేద్యమైన కోటగా తయారౌతున్నది. కాలం గడిస్తే ఇంక తన పప్పులు ఉడకవని హిట్లర్ గ్రహించాడు. ఎత్తుగడలు మార్చుకున్నాడు. "ఉమ్మడి శత్రువైన రష్యాపైకి యుద్ధానికి పోతున్నాను. మీ ఆయుధ సైనిక శక్తినంతటిని నాకు అండగా నిలపండి" అంటూ "హెస్"ను ఇంగ్లాండ్‌కు రాయబారం పంపించాడు. బాంబుల దాడితో తలబొప్పి కట్టిన బ్రిటిష్ ప్రధాని ఏమని చెప్పాడో తెలుసా? "రష్యా నీకు శత్రువు. నీవు నాకు శత్రువువి కాబట్టి నా శత్రువుకు శత్రువు నా మిత్రుడు" అని రాయబారాన్ని త్రిప్పికొట్టాడు. నిజానికి అతనికి హిట్లర్‌కు సహాయం చేయాలనే వుంది. ఆ విధంగా చేస్తే బ్రిటిష్ ప్రజలు సహించరు. ఆ విషయం చర్చిల్‌కు తెలుసు. యుద్ధసమయంలో హీరో అయిన చర్చిల్, యుద్ధం తరువాత జరిగిన ఎన్నికలలో "జీరో" అయ్యాడు.

ఇంగ్లాండ్‌కు రాయబారిని పంపుతూనే నిర్యుద్ధ సంధిని తుంగలో తొక్కి రష్యాపై హిట్లర్ యుద్ధం ప్రకటించి, సైన్యాన్ని రష్యాపైకి పంపించాడు.

రష్యాపై హిట్లర్ దాడి ప్రారంభించగానే, "సోవియెట్ యూనియన్‌పై యుద్ధం ప్రారంభించటమంటే ప్రజలపై యుద్ధం ప్రకటించటమే. నేటినుండి యుద్ధ దశ మారింది. ప్రపంచ శ్రామిక జనం సోవియెట్ యూనియన్‌ను రక్షించుకోవటానికి నడుం బిగించండి. మొత్తం ప్రజా యుద్ధంగా మార్చండి, ఫాసిస్టు శక్తులను హతమార్చటమే ఏకైక లక్ష్యంగా పనిచేయండి" అని ప్రపంచ ప్రజలకు స్టాలిన్ నాయకత్వాన సోవియెట్ సోషలిస్టు ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఫాసిస్టు వ్యతిరేక ఫ్రంట్‌ను బలపర్చాలని, బ్రిటన్, అమెరికా, ఫ్రాన్స్‌లు రెండవ యుద్ధ రంగాన్ని తెరవాలని, అందుకు ఆ దేశాలలోని ప్రభుత్వాలపై ప్రజలు ఒత్తిడి తీసుకురావాలని రష్యా విజ్ఞప్తి చేసింది.

బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికాలు ప్రత్యక్షంగా సహాయం చేయక పోయినా, రెండవ యుద్ధరంగం తెరవటంలో, సోవియెట్ యూనియన్ ఎదురుదాడి ప్రారంభించి, హిట్లర్ సైన్యాలను వెనక్కు తరిమివేయటం ప్రారంభించేవరకు జాప్యం చేశాయి.

(మిగతా వచ్చే సంచికలో)